VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : ఆదివారం 19.07.2026
సంపుటి : 09 సంచిక : 40 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



## మునుగోడు ఎస్సై బాధ్యతలు స్వీకరించిన ఎం. శోభన్ బాబుకు ఘనంగా సన్మానం..

**మునుగోడు వెలుతురు జూలై 18:**

గుండాల మండలం నుండి ఉద్యోగ బాధ్యత భాగంగా మునుగోడు ఎస్సై గా బాధ్యతలు స్వీకరించిన ఏం. శోభన్ బాబును కలిసి ఘనంగా సన్మానించిన వెలుతురు ఎడిటర్ బక్క యాదయ్య గౌడ్, సింగారం మాజీ సర్పంచ్ గుర్రాల పరమేష్.

# అందెశ్రీ స్ఫూర్తితోనే ప్రజా ప్రభుత్వం.. 2034 వరకూ మాదే అధికారం: సీఎం రేవంత్






- అందెశ్రీ తనకు ఆత్మబంధువని పేర్కొన్న సీఎం రేవంత్ రెడ్డి
- ఉద్యమ సమయంలో అందెశ్రీ పాటలే తనకు స్ఫూర్తినిచ్చాయని వ్యాఖ్య
- గత పాలకులు తెలంగాణ గీతాన్ని అణచివేశారని ఆరోపణ
- ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని స్పష్టం
- నిరుద్యోగులు మాయ మాటలను నమ్మొద్దని పిలుపు
- 2034 వరకు ప్రజా ప్రభుత్వానిదే అధికారం అని ధీమా

**హైదరాబాద్ వెలుతురు జూలై 18:**

తెలంగాణ ఉద్యమ కవి అందెశ్రీ స్మృతి వనం శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. అందెశ్రీ తనకు ఆత్మబంధువని, నిరాశలో ఉన్నప్పుడు ఆయన పాటలే తనకు స్ఫూర్తినిచ్చాయని చెప్పారు. ఇటుకపై ఇటుక పేర్చిన తాపీ మేస్త్రి అక్షరాలపై అక్షరాలు పేర్చి ఉద్యమ గీతాలు రచించి తెలంగాణ సమాజంలో చైతన్యం నింపారని కొనియాడారు.అందెశ్రీ రచించిన 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని గత ప్రభుత్వం కుట్రపూరితంగా వినిపించకుండా చేసిందని ఆరోపించిన సీఎం.. ఇప్పుడు ప్రతి పాఠశాలలో, ప్రతి గడపలో ఆ పాట వినిపిస్తోందని అన్నారు. ఆత్మగౌరవంతో అందెశ్రీ ఎప్పుడూ దొరల గడప తొక్కలేదని, ప్రజల కోసమే తన కలాన్ని ఉపయోగించారని పేర్కొన్నారు.

▶ మిగతా 2లో

## మహిళా శక్తే తెలంగాణ అభివృద్ధికి చోదకశక్తి: సీఎం రేవంత్ రెడ్డి

- ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ మహిళా పారిశ్రామికవేత్తల సమావేశంలో సీఎం ప్రసంగం
- శిల్పారామం వద్ద ఫిక్కీ కార్యాలయానికి వెయ్యి గజాల స్థలం కేటాయింపు
- భారత్ ఫ్యూచర్ సిటీలో ఫిక్కీకి మరో ఎకరం భూమి ఇస్తామని హామీ



2

## కాంగ్రెస్ కు డెత్ డిక్లరేషన్

- యువ గళాలు గర్జిస్తే కుర్చీలు కూలిపోతాయి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు
- సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సు
- యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయలేదని ఆరోపణ



2

- 70 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్

## పేపర్ లీకేజీలతో ఎన్నో కుటుంబాల్లో విషాదం

- విద్యా వ్యవస్థను పూర్తిగా మార్చాల్సిందే
- కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ డిమాండ్
- ప్రశ్నాపత్రాల లీకేజీలపై రాహుల్ తీవ్ర ఆవేదన
- దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థ పునర్నిర్మాణానికి రాహుల్ పిలుపు



2

## గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**పరిగి వెలుతురు జూలై 18:**

గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం పరిగి నియోజక వర్గంలో 185.15



2

కోట్ల వ్యయంతో రోడ్ల నిర్మాణాలు, బలోపేతం చేయడానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, పరిగి, చేవెళ్ల ఎమ్మెల్యేలు టి.రామ్మోహన్ రెడ్డి, కాలె యాదయ్య, జిల్లా కలెక్టర్ దీపక్ తివారీలతో కలిసి రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన గావించారు.

## కాంగ్రెస్, బిఆర్ఎస్ దొంగలు దొంగలు కలిసి తెలంగాణను దోచుకుంటున్నారు: బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు ఫైర్

**హైదరాబాద్ వెలుతురు జూలై 18:**

తెలంగాణ సమాజాన్ని, నిరుద్యోగ యువతను దగా చేయడంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ఒకే నాణేనికి ఉన్న బొమ్మాబొరుసు లాంటివని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ రెండు పార్టీలు "దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్నట్లు" రాష్ట్ర సంపదను దోచుకుంటూ ప్రజలను పూర్తి స్థాయిలో మోసం చేస్తున్నాయని విమర్శించారు. పదేళ్ల పాలనలో నిరుద్యోగులను నట్టేట ముంచిన బిఆర్ఎస్.. కేటీఆర్, ఇవాళ ఏ మొహం పెట్టుకొని సరూర్‌నగర్‌లో 'నిరుద్యోగ



11

సంగ్రామ సభ' పెడుతున్నారని కాసం వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. ఇది నిరుద్యోగుల కోసం పెట్టిన సభ కాదని, బిఆర్ఎస్ నాయకుల ఉద్యోగాలు పోయి, వాళ్ల కుటుంబాలు నిరుద్యోగ పాలవ్వడంతో..

## సోనమ్ అరెస్ట్ ప్రజాస్వామ్యానికే కళంకం

- మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ తీవ్ర ధ్వజం
- మల్లికార్జున్ ఖర్గే, పవన్ ఖేడా నిప్పులు
- జంతర్‌మంతర్ దీక్షపై పోలీసుల ఉక్కుపాదం
- సోనమ్‌ను బలవంతంగా ఆసుపత్రికి తరలింపు
- శాంతియుత నిరసనలపై అణచివేత ధోరణి
- కేంద్ర హోం శాఖ తీరును ఎండగట్టిన కాంగ్రెస్ నేతలు



2

- ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారు
- రాజ్యాంగ రక్షణపై ప్రతిపక్షాల ఆందోళన

## బయో-మెడికల్ వ్యర్థాల నిర్వహణలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- బయో-మెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘించే ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు, ఫెసిలిటి సెంటర్ల పై చట్టపరంగా కఠిన చర్యలు
- బయో మెడికల్ మేనేజ్మెంట్ రూల్స్- 2016 అమలు, యూజర్ ఛార్జిల పెంపు పై సమీక్షా సమావేశంలో అధికారులకు మంత్రి సురేఖ ఆదేశాలు



7

## ఆయిల్‌పామ్ రైతుల కోసం దక్షిణాది ఏకమవ్వాలి



8

- దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులకు తుమ్మల నాగేశ్వరరావు లేఖ
- ప్రధానిని కలిసి రైతుల సమస్యలు వివరించాలని ప్రతిపాదన
- ఆయిల్‌పామ్‌కు కనీస హామీ ధర రూ.25 వేలుగా నిర్ణయించాలని విజ్ఞప్తి

## 23 గ్రామ పంచాయతీలకు నాణ్యత ప్రమాణాల గుర్తింపు

- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభినందనలు
- ప్రజాకేంద్రిత పాలనకు ప్రపంచ స్థాయి ప్రమాణమిదేనని వ్యాఖ్య
- సమర్థవంతమైన పాలనకు బలమైన వ్యవస్థలే పునాదని పవన్ కళ్యాణ్
- రాష్ట్రంలోని 23 గ్రామ పంచాయతీలకు అంతర్జాతీయ నాణ్యత గుర్తింపు
- అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది కృషిని కొనియాడిన ఉప ముఖ్యమంత్రి



11



6


## కల్తీల నిరోధానికి కఠిన చట్టం...

- సమాచార సేకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలి
- చట్టం తయారీకి శాసనసభలో సమగ్ర చర్చ...
- క్యూర్ పరిధిలో పైలెట్‌గా తొలుత అమలు....
- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

## వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు కీలక సూచనలు చేసిన మంత్రి సీతక్క

- తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్ వెలుతురు జూలై 18:**



2

ఎల్ నినో ప్రభావం దేశం పై, రాష్ట్రంపై తీవ్రంగా ఉంది

ఆశించిన మేర వర్షాలు కురవని పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని ప్రభుత్వం సూచిస్తుంది ఆరు తడి పంటలు వేయడం వల్ల రైతులు నష్ట పోకుండా ఉంటారు. రైతులు పంట మార్పిడి కి రావాలి.చెరువులు, కుంటలు, డ్యామ్ పరివాహక ప్రాంతాల్లో కూడా వర్షాధారిత పంటలు వేయద్దు.

# కాంగ్రెస్ కు డెత్ డిక్లరేషన్

- ఉద్యోగాల కంటే రాహుల్‌గాంధీ రాజకీయాలపైనే రేవంత్ దృష్టి అని వ్యాఖ్య

**హైదరాబాద్ వెలుతురు జూలై 18:**

యువత గళం బలంగా వినిపిస్తే అధికార కుర్చీలు కూడా కూలిపోతాయని భారత రాష్ట్ర సమితి కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఇప్పటివరకు ఒక లెక్క అయితే.. ఇకపై మరో లెక్క ఉంటుందని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రకటించిన యూత్ డిక్లరేషన్ యువతను మోసం చేసేందుకేనని ఆరోపించిన కేటీఆర్.. ఆ పార్టీకి యువత డెత్ డిక్లరేషన్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో వేలాది మంది విద్యార్థుల ప్రాణాలు పోవడానికి కాంగ్రెస్ బాధ్యత వహించాలని ఆరోపించారు. యువతతో రాజకీయాలు చేస్తే ఆ ప్రభావం తరాలపాటు ఉంటుందని వ్యాఖ్యానించారు.యూత్ డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించిన కేటీఆర్.. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి బదులుగా అవినీతి, అక్రమాలే పెరిగాయని విమర్శించారు. తెలంగాణలో ఉద్యోగ నోటిఫికేషన్లు కనిపించడం లేదని, 'లూటీ నోటిఫికేషన్లే' కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకుల రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం 70 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు నోటిఫికేషన్లతో సహా నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని కేటీఆర్ సవాల్ విసిరారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతున్నారని, ఆయనకు పదవి ఇచ్చింది తెలంగాణ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకా, లేక రాహుల్ గాంధీకి రాజకీయ ప్రయోజనం చేకూర్చేందుకా అని ప్రశ్నించారు.తెలుగు, ఆంగ్ల సంవత్సరాలు మారుతున్నా ఉద్యోగాల వార్షిక ప్రణాళిక మాత్రం మారడం లేదని కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీలో ప్రకటించిన ఉద్యోగాల ప్రణాళిక ఇప్పుడు విలువలేని కాగితంగా మారిందని ఆరోపించారు. యువత తమ హక్కుల కోసం పోరాడేందుకు ముందుకు వచ్చిందని పేర్కొంటూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చకపోతే తీవ్ర రాజకీయ పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# అందెశ్రీ స్ఫూర్తితోనే ప్రజా ప్రభుత్వం..

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మాజీ పాలకులపై తీవ్ర విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి.. పదేళ్లు నోటిఫికేషన్లు ఇచ్చామని చెప్పుకున్నా ఉద్యోగాలు ఎందుకు భర్తీ చేయలేకపోయారని ప్రశ్నించారు. పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల భవిష్యత్తును నాశనం చేశారని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అడ్డంకులు తొలగించి ఏడాదిలోనే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసి నియామక పత్రాలు అందించామని చెప్పారు.తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారిని తమ ప్రభుత్వం గౌరవిస్తోందని సీఎం తెలిపారు. శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మను, చాకలి ఐలమ్మ మనుమరాలిని మహిళా కమిషన్ సభ్యులుగా నియమించామని, కోదండరాంను ఎమ్మెల్సీగా అవకాశం కల్పించామని చెప్పారు. తొమ్మిది మంది కవులను కోటి రూపాయల నగదు బహుమతితో సన్మానించామని గుర్తుచేశారు.తెలంగాణలో మళ్లీ గడీల పాలనకు అవకాశం లేదని స్పష్టం చేసిన సీఎం.. నిరుద్యోగులు మాయగాళ్ల మాటలు నమ్మొద్దని సూచించారు. ప్రభుత్వం ప్రతి ఉద్యోగ ఖాళీని భర్తీ చేస్తుందని హామీ ఇచ్చారు. "2034 వరకు ప్రజా ప్రభుత్వానిదే అధికారం. ఇదే భవిష్యత్, ఇదే చరిత్ర. తెలంగాణ సమాజం అన్నీ గమనిస్తోంది" అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

# గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



(మొదటి పేజీ తరువాయి)

అనంతరం పరిగి మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఏబీఎస్ ప్లాజా ఫంక్షన్ హాల్ లో జరిగిన సభలో రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.రాష్ట్ర వ్యాప్తంగా ఇండ్లు లేని నిరుపేదలకు ఐదు లక్షల ఆర్థిక సహాయం అందించి నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. వికారాబాద్ జిల్లాకు రోడ్ల అభివృద్ధికి గాను 900 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో రోడ్ల నిర్మాణాల నిమిత్తం అత్యధిక నిధులను కేటాయించి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా పరిగి నియోజకవర్గంలో184.15 కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. రోడ్ల సౌకర్యం మెరుగ్గా ఉంటే పరిశ్రమలు, వ్యాపారాలు వృద్ధి చెందుతాయని అలాగే ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని ఆయన అన్నారు. రోడ్లు విస్తారంగా ఉంటేనే రోడ్డు ప్రమాదాలు తగ్గి ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చునని మంత్రి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హుడైన ప్రతి పేదవాడికి రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు సన్న బియ్యాన్ని పంపిణీ జరుగుతుందని ఆయన తెలిపారు. 500 రూపాయల సబ్సిడీతో గ్యాస్ సిలిండర్లను ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. గత పది సంవత్సరాలుగా ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగ నిరాశకు గురవుతున్న యువతను ఆదుకునేందుకు గ్రూప్-1, గ్రూప్-2 తదితర పరీక్ష నిర్వహించి 67,773 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని మంత్రి తెలిపారు. లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టును పనులను వేగవంతం చేసి పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు.ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చుకుంటూ విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత కల్పిస్తూ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పరిగి ప్రాంతంలో పరిశ్రమలను నెలకొల్పి ఉపాధి కల్పనకు కృషి చేస్తామని మంత్రి అన్నారు. జరుగుతుందన్నారు.రైతులకు ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రూపాయలను మాఫీని ప్రభుత్వం చేపట్టిందన్నారు. మహాలక్ష్మి పథకం కింద 500 రూపాయల గ్యాస్, ఉచిత బస్సు ప్రయాణమును చేపట్టడం జరుగుతుందని అలాగే రాష్ట్రంలో 90 శాతం 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇవ్వడం జరుగుతుంది మంత్రి అన్నారు.స్థానిక శాసనసభ్యులు టి.రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ... పరిగి నియోజకవర్గంలో పరిశ్రమలను స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రయత్నించాలన్నారు. నియోజకవర్గంలో ప్రాజెక్ట్ పనులకు, పరిశ్రమల స్థాపనకు భూ సేకరణ సహకరిస్తామని ఆయన అన్నారు. నియోజకవర్గంలో రెండు లైన్ల రోడ్డును నాలుగు లైన్ల రోడ్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని మంత్రుల దృష్టికి తీసుకువెళ్లారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఉమాశంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఇ.వెంకటాచారి, ఆర్డీఓ అనిత, ఆర్ అండ్ బి ఎస్.ఇ వసంత్ నాయక్, మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షా భావ పరిస్థితుల్లో రైతులకు కీలక...

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడున్న పరిస్థితులో వర్షాధారిత పంటల వల్ల రైతులు నష్ట పోయే అవకాశముంది.రాష్ట్రంలో ఎండ తీవ్రత కొనసాగుతుంది .వర్షాలు లేక భూగర్భ జలాలు కూడా అడగంటుతున్నాయి. తాగునీరుకి మొదటి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది .తాగు నీరుని నిల్వ చేయాల్సిన అవసరముంది .ముఖ్యమంత్రి ఆదేశాలతో సోమవారం నుంచి జల సిరి కార్యక్రమం మొదలవుతుంది .జల సిరి కార్యక్రమంలో ఇంటి కొక ఇంకుడు గుంత, ఊరు కోక ఊట కుంట, ప్రతీ పంటకు పంట కుంట నిర్మిస్తాము.ప్రతి ఒక్క నీటి బొట్టును ఈ కార్యక్రమం ద్వారా ఒడిసి పడతాం.ఉపాధి హామీ పథకంలో భాగంగా జల సిరి కార్యక్రమ పనులు జరుగుతాయి .జల సిరి కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు .జల సిరి కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలి

# మహిళా శక్తే తెలంగాణ అభివృద్ధికి చోదకశక్తి: సీఎం రేవంత్ రెడ్డి

- మహిళా సాధికారత కోసం రెండో ఇండస్ట్రియల్ పార్క్ ప్రతిపాదన పరిశీలన
- ప్రతి మూడు నెలలకోసారి మహిళా పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహిస్తానన్న సీఎం

**హైదరాబాద్ వెలుతురు జూలై 18:**





మహిళా శక్తి దీవెనలే తమ ప్రభుత్వానికి బలమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మహిళల మద్దతుతోనే 2023 డిసెంబరులో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని పేర్కొన్నారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్‌వో) ఆధ్వర్యంలో మహిళా పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సమావేశంలో సీఎం మాట్లాడారు.మహిళా స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్రంలోని 22 జిల్లా కేంద్రాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ భవనాలు శిక్షణ, మార్కెటింగ్, వ్యాపార కార్యకలాపాలకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో కేంద్రాలుగా మారనున్నాయని చెప్పారు.హైటెక్ సిటీలో శిల్పారామం సమీపంలో రూ.1,000 కోట్ల విలువైన స్థలాన్ని ఇందిరా మహిళా శక్తి బజార్ కోసం కేటాయించామని తెలిపారు. అక్కడ మహిళా సంఘాల కోసం 150కిపైగా దుకాణాలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అదే ప్రాంతంలో ఫిక్కీ ప్రధాన కార్యాలయం నిర్మించుకునేందుకు వెయ్యి గజాల స్థలాన్ని కేటాయిస్తామని ప్రకటించారు. అలాగే భారత్ ఫ్యూచర్ సిటీలో ఫిక్కీకి మరో ఎకరం భూమి ఇస్తామని హామీ ఇచ్చారు.భారత్ ఫ్యూచర్ సిటీలో అమెజాన్ వంటి దిగ్గజ సంస్థ లక్ష కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టబోతోందని, భవిష్యత్తులో ఫార్చ్యూన్-500 కంపెనీలను అక్కడికి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనలో ఫిక్కీతో పాటు మహిళా పారిశ్రామికవేత్తల పాత్ర కీలకమని అన్నారు.మహిళా పారిశ్రామికవేత్తలను అన్ని విధాలా ప్రోత్సహిస్తామని, ప్రతి మూడు నెలలకోసారి వారితో సమావేశమై సమస్యలు, అవకాశాలపై చర్చిస్తానని సీఎం వెల్లడించారు. ఎఫ్ఎల్‌వో ఆధ్వర్యంలోని ఇండస్ట్రియల్ పార్క్ విజయవంతమైన నేపథ్యంలో మరో మహిళా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు.తెలంగాణలో 67 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాలు సరికొత్త విప్లవాన్ని సృష్టిస్తున్నాయని, వీటికి రూ.16 వేల కోట్ల రుణాలు అందించామని తెలిపారు. ప్రస్తుతం మహిళలు పెట్రోల్ బంకులను కూడా నిర్వహిస్తూ కార్పొరేట్ సంస్థలతో పోటీ పడుతున్నారని అన్నారు.మహాలక్ష్మి పథకం కింద మహిళల ఉచిత బస్సు ప్రయాణాల కోసం ఇప్పటివరకు ఆర్టీసీకి రూ.11 వేల కోట్లు చెల్లించామని చెప్పారు. ఈ పథకం వల్ల మహిళలు ప్రయాణికులే కాకుండా వెయ్యి బస్సులకు యజమానులుగా మారి ఆర్టీసీకి అద్దెకు ఇస్తున్నారని వివరించారు.ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళా సంఘాల ఆధ్వర్యంలో 1,000 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించామని, 27.5 లక్షల మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫారాలు కుట్టే పనిని కూడా మహిళా సంఘాలకే అప్పగించినట్లు వెల్లడించారు.రాష్ట్రవ్యాప్తంగా 8 వేల ఇందిరా స్త్రీ శక్తి భవనాలకు శంకుస్థాపన చేశామని, మహిళా సంఘాల ఉత్పత్తులను అమెజాన్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వ్యాపారాల్లో రాణిస్తున్న మహిళా సంఘాలకు ఫిక్కీ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది అవార్డులు అందించే సంప్రదాయం తీసుకురావాలని సూచించారు.2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సీఎం తెలిపారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 5 శాతం నుంచి 10 శాతానికి పెంచాలని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళలకు ప్రధానమంత్రి, రాష్ట్రపతి, ముఖ్యమంత్రి, గవర్నర్, న్యాయమూర్తుల వంటి అత్యున్నత పదవులు కల్పించిందని గుర్తుచేశారు. సోనియా గాంధీ ప్రవేశ పెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు త్వరలో అమల్లోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పేపర్ లీకేజీలతో ఎన్నో కుటుంబాల్లో విషాదం

- నీట్ వివాదంతో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థిని రియా
- 'ఎక్స్' పోస్టులో బాధితురాలి తండ్రి బాధ ప్రస్తావన

**ఢిల్లీ వెలుతురు జూలై 18:**



దేశంలో వరుసగా జరుగుతున్న పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీల ఉదంతాలపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అత్యంత తీవ్రంగా స్పందించారు. ఈ దారుణమైన లీకేజీల కారణంగా దేశంలోని ఎంతో మంది ప్రతిభావంతులైన విద్యార్థుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వారు తీవ్రమైన మానసిక వేదనను అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన సమయం ఆసన్నమైందని, విద్యార్థులకు పూర్తి నమ్మకం, భద్రత కల్పించేలా దీనిని పునర్నిర్మించాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు.శనివారం ఉదయం రాహుల్ గాంధీ తన అధికారిక సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఒక సుదీర్ఘమైన మరియు భావోద్వేగభరితమైన పోస్ట్‌ను పెట్టారు. ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా పెద్ద దుమారం రేపిన నీట్ (NEET) పరీక్ష పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో, తీవ్ర మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడిన రియా అనే విద్యార్థిని ఉదంతాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. రియా మరణం తర్వాత ఆమె తండ్రి రాజేశ్‌తో తాను స్వయంగా మాట్లాడిన విషయాలను, ఆ సమయంలో ఆయన పడిన బాధను రాహుల్ ఈ పోస్టులో గుర్తు చేసుకున్నారు.కంటికి రెప్పలా పెంచుకున్న తన ప్రాణాలకంటే ఎక్కువైన కుమార్తెను కోల్పోయిన బాధతో తండ్రి రాజేశ్ గుండె పగిలేలా ఏడ్చారని, ఆయన మానసికంగా పూర్తిగా కుంగిపోయారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒక మధ్యతరగతి తండ్రి తన బిడ్డను పెద్ద చదువులు చదివించి ప్రయోజకురాలిని చేయాలనుకుంటే, ఈ లీకేజీల వ్యవస్థ ఆమె ప్రాణాలనే బలితీసుకుందని మండిపడ్డారు. రాజేశ్ అనుభవిస్తున్న ఈ భరించలేని వేదన, కడుపుకోత విన్న ప్రతి ఒక్కరి హృదయాలను కలచివేస్తోందని రాహుల్ అన్నారు.

ఈ ఘోరమైన పరిణామం కేవలం ఒక రియా కుటుంబానికి సంబంధించిన వ్యక్తిగత విషాదం మాత్రమే కాదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దేశంలో పేపర్ లీకేజీలనేవి ఒక మాఫియాగా మారి లక్షలాది మంది విద్యార్థుల కలలను, వారి భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం మరియు పరీక్షల నిర్వహణ సంస్థల వైఫల్యం వల్ల ఎంతో మంది అమాయక విద్యార్థులు నిరాశతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, పాలకుల తప్పులకు పిల్లలు బలికావడం దారుణమన్నారు.పోటీ పరీక్షల ఫలితాల జాబితాలో కనిపించే లేదా వార్తల్లో వినపడే ప్రతి విద్యార్థి పేరు వెనుక ఒక కన్నతల్లి, ఒక కన్నతండ్రి ఉంటారని రాహుల్ గాంధీ గుర్తు చేశారు. వారు తమ పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారని, వారి బంగారు భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమిస్తారని చెప్పారు. కానీ ఈ లీకేజీల భూతం ఆ తల్లిదండ్రులకు తమ పిల్లలను శాశ్వతంగా దూరం చేస్తోందని, బిడ్డలు లేని ఆ కన్నవారి జీవితాలు రేపటి రోజు అనేది లేకుండా పూర్తిగా చీకటిమయంగా మారిపోతున్నాయని ఆవేదన చెందారు.పరీక్షల విధానంలో ఉన్న లోపాల వల్ల విద్యార్థులు విపరీతమైన మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని రాహుల్ గాంధీ విశ్లేషించారు. అక్రమార్కుల చేతుల్లోకి పేపర్లు వెళ్తుంటే, కష్టపడి చదివే పిల్లలు అభద్రతా భావంతో నలిగిపోతున్నారన్నారు. విద్యార్థులు ఎలాంటి భయాలు, ఆందోళనలు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో, పూర్తి భద్రతతో పరీక్షలు రాసేలా ప్రస్తుత నిబంధనలను మార్చాలన్నారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత లేకపోతే యువత నమ్మకం కోల్పోతుందని హెచ్చరించారు.తమ పిల్లలను డాక్టర్లుగానో, ఇంజినీర్లుగానో చూడాలని తల్లిదండ్రులు తమ రక్తాన్ని చెమటగా మార్చి, తిండి తిని తినక డబ్బులు కూడబెట్టి చదివిస్తారని, వారు చేసే త్యాగాలు అంత తేలికైనవి కావని రాహుల్ అన్నారు. కన్నవారు చేసిన ఆ త్యాగాలకు ప్రతిఫలంగా వారికి దక్కాల్సింది పిల్లల విజయాలు, వారి ముఖాల్లో సంతోషమే కానీ.. ఇలాంటి పేపర్ లీకేజీల వల్ల వచ్చే కన్నీళ్లు, గుండెకోత కాదన్నారు. న్యాయం కోసం ఎదురుచూస్తున్న తల్లిదండ్రులకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని నిలదీశారు.ఇకనైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి విద్యా రంగంలో, పరీక్షల నిర్వహణ సంస్థల్లో సమూలమైన మార్పులను తీసుకురావాలని రాహుల్ గాంధీ గట్టిగా కోరారు. తప్పు చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చట్టాలు తేవాలన్నారు. దేశంలోని ప్రతి విద్యార్థికి పూర్తి భద్రత లభించే వరకు, బాధితులైన తల్లిదండ్రులకు న్యాయం జరిగే వరకు ప్రతిపక్ష నాయకుడిగా పార్లమెంట్ లోపలా, వెలుపలా తన పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉంటానని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

# సోనమ్ అరెస్ట్ ప్రజాస్వామ్యానికే కళంకం

- హోం శాఖ కనుసన్నల్లోనే ఢిల్లీ పోలీస్ యంత్రాంగం

**ఢిల్లీ వెలుతురు జూలై 18:**

దేశ రాజధాని న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా లడఖ్ పర్యావరణ పరిరక్షణ, హక్కుల సాధన కోసం శాంతియుత మార్గంలో నిరాహార దీక్ష చేస్తున్న ప్రముఖ పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఉదంతం దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేకెత్తిస్తోంది. ఆయన చేస్తున్న దీక్షను భగ్నం చేసేందుకు ఢిల్లీ పోలీసులు ఉక్కుపాదం మోపారు. అర్ధరాత్రి వేళ దీక్షా శిబిరం వద్దకు భారీగా చేరుకున్న పోలీసులు, సోనమ్ వాంగ్‌చుక్‌ను అక్కడ నుంచి బలవంతంగా తరలించి సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో చేర్చారు. ఈ హఠాత్ పరిణామం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారానికి దారితీసింది.సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు బలవంతంగా ఆసుపత్రికి తరలించిన తీరుపై ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ అత్యంత తీవ్రంగా స్పందించింది. ఈ అమానుష ఘటనపై కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. లడఖ్ ప్రజల హక్కుల కోసం శాంతియుతంగా పోరాడుతున్న ఒక మేధావిని, పర్యావరణ ప్రేమికుడిని ఇలా నిర్బంధించడం దేశ ప్రజాస్వామ్యానికి, భారత రాజ్యాంగానికి తీరని నష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన దేశ చరిత్రలో మరో నల్లమచ్చగా నిలిచిపోతుందని మండిపడ్డారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పవన్ ఖేడా కూడా ఈ ఉదంతంపై ప్రత్యేకంగా స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. దేశంలో శాంతియుతంగా నిరసనలు తెలిపే ప్రజాస్వామ్య హక్కులను గౌరవించడం మోదీ ప్రభుత్వానికి చేతకావడం లేదని ఆరోపించారు. పౌరుల గళాన్ని అణచివేయాల్సిన ఒక శాంతిభద్రతల సమస్యగా మాత్రమే ప్రభుత్వం ప్రతి నిరసనను భావిస్తోందని విమర్శించారు. లడఖ్ పర్యావరణం కోసం ఢిల్లీ వీధుల్లో కూర్చున్న ఒక యోధుడిని నేరస్థుడిలా చూడటం దేశ పాలకుల అహంకారానికి నిదర్శనమన్నారు.భారత రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి తన గళాన్ని వినిపించే, అలాగే శాంతియుతంగా తమ నిరసనలను వ్యక్తపరిచే అత్యంత పవిత్రమైన ప్రాథమిక హక్కులను కల్పించిందని పవన్ ఖేడా గుర్తు చేశారు. అయితే, ప్రస్తుత కేంద్ర హోం శాఖ వ్యవహరిస్తున్న వైఖరిని గమనిస్తుంటే, ఆ సంస్థ సరిగ్గా ఈ రాజ్యాంగబద్ధమైన హక్కులనే లక్ష్యంగా చేసుకుని దాడి చేస్తున్నట్లు కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలకుల తప్పులను ప్రశ్నిస్తే హక్కులను కాలరాసే సంస్కృతి పెరిగిపోతోందని దుయ్యబట్టారు.ఢిల్లీ పోలీస్ యంత్రాంగం నేరుగా కేంద్ర హోం శాఖ పరిధిలో పనిచేస్తుందనే విషయాన్ని పవన్ ఖేడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం ఇదివరకే ఢిల్లీ నగరానికి కొత్త పోలీస్ కమిషనర్‌ను నియమించిందని, ఆయన బాధ్యతలు చేపట్టిన వెంటనే ఇలాంటి అప్రజాస్వామిక చర్యకు పాల్పడటం దారుణమన్నారు. సోనమ్ వాంగ్‌చుక్ దీక్షను అమానుషంగా భగ్నం చేయడమే కొత్త కమిషనర్ గనుక ఢిల్లీ ప్రజలకు మరియు దేశానికి ఇస్తున్న మొదటి సందేశం అయితే, అది అత్యంత విచారకరమైన విషయమని వ్యాఖ్యానించారు.పోలీస్ ఉన్నతాధికారుల వ్యవహార శైలిపై కాంగ్రెస్ నేత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శాంతియుత నిరసనకారులను ఆసుపత్రుల పాలు చేయడం ద్వారా కొత్త పోలీస్ కమిషనర్ తన రాజ్యాంగపరమైన బాధ్యత కంటే, కేంద్రంలో ఉన్న అధికార పీఠానికే ఎక్కువ విధేయత చూపిస్తున్నారని ఈ ఘటనతో స్పష్టంగా అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. చట్టాన్ని రక్షించాల్సిన వారే పాలకుల రాజకీయ ప్రయోజనాల కోసం పౌరుల హక్కులను తొక్కిపెడుతున్నారని విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం కానీ, దాని పరిధిలోని పోలీస్ యంత్రాంగం కానీ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను ఏమాత్రం గౌరవించడం లేదని చెప్పడానికి ఈ ఒక్క ఘటన మాత్రమే కాదని పవన్ ఖేడా అన్నారు. గతంలో దేశం కోసం పతకాలు తెచ్చిన మహిళా రెజ్లర్లను ఢిల్లీ వీధుల్లో పోలీసులు బూట్లతో తొక్కి, ఈడ్చుకుంటూ వెళ్లిన ఉదంతాన్ని, అలాగే దేశ సరిహద్దుల్లో సేవలందించిన మాజీ సైనికుల పట్ల కేంద్రం దురుసుగా ప్రవర్తించిన తీరును గుర్తు చేశారు. ఈ వరుస ఘటనలే ప్రస్తుత ప్రభుత్వ మనస్తత్వానికి నిలువెత్తు సాక్ష్యాలని పదేపదే నిరూపిస్తున్నాయన్నారు.ఈ ప్రభుత్వ దృష్టిలో శాంతియుత నిరసన అనేది పౌరుడి ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు కాదని, అది కేవలం లాఠీలతో, పోలీసు బలగాలతో అణచివేయాల్సిన ఒక శాంతిభద్రతల సమస్య మాత్రమేనని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా విమర్శించింది. ప్రశ్నించే గొంతుకలను జైళ్లలో పెట్టడం లేదా ఆసుపత్రులకు తరలించడం ద్వారా భయభ్రాంతులకు గురిచేయలేరని స్పష్టం చేసింది. సోనమ్ వాంగ్‌చుక్ లాంటి పర్యావరణ యోధులపై జరిగిన ఈ దాడిని దేశంలోని ప్రజాస్వామ్యవాదులంతా ఏకతాటిపైకి వచ్చి ఖండించాలని, హక్కుల రక్షణ కోసం పోరాడాలని పిలుపునిచ్చింది.

# తెలంగాణ పీసీసీ పనితీరుపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేసిన ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్

**హైదరాబాద్ వెలుతురు జూలై 18:**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టిన అనంతరం పార్టీ చేపట్టిన వివిధ సంస్థాగత కార్యక్రమాలు, శిక్షణా కార్యక్రమాలు మరియు ప్రజా ఉద్యమాలపై ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు.ఏఐసీసీ పిలుపు మేరకు నిర్వహించిన సంఘటన్ సృజన్ అభియాన్, జై బాపు – జై భీమ్, మనగేర కార్యక్రమం, డీసీసీ అధ్యక్షుల శిక్షణా శిబిరాలు, ఎస్ఐఆర్ శిక్షణా కార్యక్రమాలు, బీఎల్ఏల నియామకాలు, డీసీసీ కమిటీల ఏర్పాటు, మండల కమిటీల నియామకం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసినందుకు పీసీసీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఏఐసీసీ కనెక్టింగ్ సెంటర్ చైర్మన్ సెంతిల్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ కలిసి పీసీసీ అధ్యక్షులతో పాటు రాష్ట్ర పీసీసీ కార్యాలయ బృందాన్ని కూడా అభినందించారు.ప్రతి నెల తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తరఫున రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై సమగ్ర కార్యాచరణ నివేదికను సిద్ధం చేసి ఏఐసీసీకి పంపిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, పీసీసీ అధ్యక్షుల కార్యాలయ ఇన్‌చార్జ్ పి. ప్రసన్న కుమార్ శర్మ సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. జూన్ నెలకు సంబంధించిన కార్యాచరణ



నివేదిక పుస్తకాన్ని పరిశీలిస్తూ, రాష్ట్ర పార్టీ కార్యకలాపాల అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఇటీవల నిర్వహించిన ఎస్ఐఆర్ ప్రక్రియ, బీఎల్ఏ శిక్షణా కార్యక్రమాలు, జనహిత పాదయాత్ర తదితర కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష నిర్వహించిన అనంతరం, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అమలు చేస్తున్న సంస్థాగత విధానం దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల అమలు తీరును ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేయాలనే ఉద్దేశంతో దాదాపు 11 రాష్ట్రాల నుంచి ఏఐసీసీ నాయకులు, సీడబ్ల్యూసీ సభ్యులు తెలంగాణ పీసీసీని అభినందించినట్లు తెలిపారు.మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని, శ్రీ రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రతి బీఎల్ఏపై సూపర్వైజర్‌ను నియమించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.తెలంగాణ పీసీసీ చేపడుతున్న కార్యక్రమాలపై ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సి. వేణుగోపాల్ కూడా సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆమె తెలిపారు.అదేవిధంగా పార్టీ కార్యాలయ కార్యకలాపాల సమన్వయం, కార్యాచరణ నివేదికల తయారీ, సంస్థాగత కార్యక్రమాల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న పి. ప్రసన్న కుమార్ శర్మను ప్రత్యేకంగా అభినందిస్తూ, భవిష్యత్తులో సోషల్ మీడియా, కనెక్టింగ్ సెంటర్ మరియు పార్టీ సంస్థాగత కార్యక్రమాలను మరింత చురుకుగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.గాంధీ భవన్ లో జరిగిన కార్యక్రమంలో బాగంగా మాట్లాడుతూ గాంధీ భవన్ స్టాప్ ను కూడా అభినందించారు.ఈ సమావేశంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కనెక్టింగ్ సెంటర్ చైర్మన్ సెంతిల్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, పీసీసీ అధ్యక్షుల కార్యాలయానికి అనుబంధంగా పనిచేస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రవీణ్ కుమార్ ,గంప వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ గారిని కలిసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు భీమ లక్ష్మణ్ ముదిరాజ్

**హైదరాబాద్ వెలుతురు జూలై 18:**



కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీ భీమ లక్ష్మణ్ ముదిరాజ్ గారు ఈరోజు ఉదయం గౌరవ ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ శ్రీమతి మీనాక్షి నటరాజన్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామస్థాయిలో నెలకొన్న రాజకీయ, పార్టీ పరమైన పరిణామాలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేయడానికి పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న యువ నాయకులు, అంకితభావంతో పనిచేస్తున్న కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.దీనిపై స్పందించిన శ్రీమతి మీనాక్షి నటరాజన్ గారు పార్టీ కోసం నిజాయితీగా, నిబద్ధతతో పనిచేస్తున్న ప్రతి నాయకుడు, కార్యకర్త సేవలను పార్టీ నాయకత్వం గుర్తిస్తోందని తెలిపారు. అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలిస్తున్నామని, యువతకు ప్రాధాన్యత కల్పించడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకులకు తప్పకుండా న్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.తన వినతిని ఎంతో ఓర్పుతో ఆలకించి, ప్రోత్సాహకరమైన మాటలతో ధైర్యం చెప్పిన గౌరవ ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ శ్రీమతి మీనాక్షి నటరాజన్ గారికి శ్రీ భీమ లక్ష్మణ్ ముదిరాజ్ గారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# గాంధేయ ఆశయాలకు సజీవ రూపం – మీనాక్షి నటరాజన్



## సత్యం, సేవ, నిరాడంబరతతో ప్రజాసేవకు అంకితమైన నాయకత్వం

మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, సేవ, త్యాగం, నిరాడంబర జీవనం అనే విలువలు భారత రాజకీయాలకు శాశ్వత మార్గదర్శకాలు. నేటి రాజకీయాల్లో ఈ విలువలను ఆచరణలో నిలబెట్టే నాయకత్వం ఎంతో అవసరం. అలాంటి గాంధేయ భావజాలాన్ని తన వ్యక్తిత్వంలో, ప్రజాసేవలో ప్రతిబింబిస్తూ ముందుకు సాగుతున్న నాయకురాలు శ్రీమతి మీనాక్షి నటరాజన్ గారు.రాజకీయాలు అధికారం కోసం కాకుండా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి ఒక పవిత్ర సాధనమనే గాంధీజీ సందేశాన్ని ఆమె తన ప్రతి అడుగులో ఆచరిస్తున్నారు. సాధారణ జీవనశైలి, నైతిక విలువల పట్ల అచంచల నిబద్ధత, ప్రజలతో మమేకమై పనిచేసే తీరు ఆమెను ప్రత్యేక నాయకురాలిగా నిలబెట్టాయి.నేటి రాజకీయాల్లో విలువల ఆధారిత నాయకత్వం ఎంత ముఖ్యమో మీనాక్షి నటరాజన్ గారి ప్రజా జీవితం స్పష్టంగా చాటుతోంది. గ్రామీణ భారత అభివృద్ధి, సామాజిక న్యాయం, యువతలో ప్రజాస్వామ్య చైతన్యం, మహిళా సాధికారత వంటి అంశాల్లో ఆమె చూపుతున్న అంకితభావం గాంధేయ సిద్ధాంతాలకు అద్దం పడుతోంది.కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ మహాత్మా గాంధీ ఆశయాలను పరిరక్షిస్తూ, ప్రజాసేవనే రాజకీయాల పరమావధిగా విశ్వసిస్తుంది. అదే మార్గంలో నడుస్తూ గాంధేయ విలువలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న మీనాక్షి నటరాజన్ గారి సేవలు దేశ రాజకీయాలకు స్ఫూర్తిదాయకం.గాంధీజీ కలలుగన్న సమానత్వం, సామాజిక న్యాయం, శాంతి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ మరింత అంకితభావంతో పనిచేస్తుందని ఈ సందర్భంగా పునరుద్ఘాటిస్తున్నాము.“గాంధేయవాదం పుస్తకాలలో ఉండే సిద్ధాంతం కాదు... ప్రజల జీవితాల్లో ఆచరించాల్సిన విలువ. ఆ విలువలను తన జీవన విధానంతో నిలబెడుతున్న నాయకురాలు మీనాక్షి నటరాజన్ గారు.”గాంధీజీ ఆశయాల స్ఫూర్తితో మీనాక్షి నటరాజన్ సేవలు ఆదర్శనీయం మహాత్మా గాంధీ చూపిన మార్గం సత్యం, అహింస, సేవ, సమానత్వం అనే విలువలపై నిర్మితమైంది. రాజకీయాలు అంటే అధికారం కోసం కాదు, ప్రజాసేవ కోసం అనే భావజాలాన్ని గాంధీజీ దేశానికి అందించారు. అలాంటి గాంధేయ సిద్ధాంతాలను ఆచరణలో నిలబెట్టే నాయకులతో కలిసి పనిచేసే అవకాశం దక్కడం నా అదృష్టంగా భావిస్తున్నాను.ఈ అవకాశం కల్పించి నాపై విశ్వాసం ఉంచిన తెలంగాణ ప్రదేశ్





కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. పార్టీ ఆశయాలకు అనుగుణంగా, ప్రజల కోసం మరియు పార్టీ బలోపేతం కోసం మరింత నిబద్ధతతో పనిచేస్తానని ఈ సందర్భంగా హామీ ఇస్తున్నాను.”ప్రత్యేకించి శ్రీమతి మీనాక్షి నటరాజన్ గారితో కలిసి పనిచేయడం నాకు ఎంతో ప్రేరణనిచ్చింది. ఆమె ఆలోచనా విధానం, ప్రజల పట్ల ఉన్న అంకితభావం, ముఖ్యంగా పేదలు, మహిళలు, అణగారిన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయడం నన్ను ఎంతగానో ప్రభావితం చేసింది.మీనాక్షి నటరాజన్ గారు ప్రతిరోజూ సమాజంలోని బలహీన వర్గాల సమస్యలను అర్థం చేసుకుని, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు. మహిళా సాధికారత, సామాజిక న్యాయం, గ్రామీణాభివృద్ధి, పేద ప్రజల జీవన ప్రమాణాల పెంపు వంటి అంశాల్లో ఆమె చూపుతున్న నిబద్ధత నిజంగా ప్రశంసనీయం.రాజకీయ నాయకత్వం అంటే కేవలం పదవులు కాదు, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే తపన కావాలని ఆమె తన పనితీరుతో నిరూపిస్తున్నారు. గాంధీజీ ఆశయాలను ఆధునిక కాలానికి అనుగుణంగా ముందుకు తీసుకెళ్తూ, సేవనే రాజకీయాల పరమార్థంగా భావించడం ఆమె నాయకత్వంలోని గొప్ప విశేషం.ఆమెతో కలిసి పనిచేసే ప్రతి సందర్భంలో ప్రజాసేవ పట్ల మరింత బాధ్యత, నిబద్ధతతో పనిచేయాలనే స్ఫూర్తి కలుగుతోంది. పేదల కోసం, మహిళల కోసం, సామాజిక న్యాయం కోసం ఆమె చేస్తున్న సేవలకు నా హృదయపూర్వక అభినందనలు. ఆమె సేవా ప్రయాణం మరెందరికో ఆదర్శంగా నిలుస్తుందని నేను విశ్వసిస్తున్నాను.మహాత్మా గాంధీ గారిని నేను ప్రత్యక్షంగా చూడలేదు. కానీ మీనాక్షి నటరాజన్ గారితో కలిసి పనిచేస్తున్న ప్రతి సందర్భంలో గాంధీజీ గుర్తుకు వస్తారు. గాంధీజీ చెప్పిన సేవా భావం, నిరాడంబర జీవనం, పేదల పట్ల ప్రేమ, సామాజిక న్యాయం కోసం అంకితభావం——ఈ విలువలు మీనాక్షి నటరాజన్ గారి ఆలోచనల్లో, ఆచరణలో ప్రతిబింబిస్తుంటాయి. అందుకే ఆమెతో కలిసి పనిచేస్తుంటే, గాంధీజీ ఆశయాలతో నడిచే ఒక ఉద్యమంలో భాగమైన అనుభూతి కలుగుతోంది. ప్రజల కోసం ఆమె చేస్తున్న సేవ నిజంగా స్ఫూర్తిదాయకం.”హ్యాట్స్ ఆఫ్ టు మీనాక్షి నటరాజన్ గారు. గాంధేయ విలువలను కార్యరూపంలో చూపిస్తూ ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న మీలాంటి నాయకులతో కలిసి పనిచేయడం నిజంగా గర్వకారణం.



# అంతరంగంలో రావణత్వం... ఆచారాల ఆర్భాటం!

యుగయుగాలుగా భారతీయ సంస్కృతికి, నైతిక విలువలకు దిక్సూచిగా నిలుస్తోంది రామాయణ మహాకావ్యం. ప్రతి ఇంటా ఒక రామాయణ గ్రంథం పూజలందుకుంటుంది. ప్రతి పర్వదినాన శ్రీరాముడి పవిత్ర గాథ మారుమోగుతుంది. ముఖ్యంగా విజయదశమి పండుగ వచ్చిందంటే చాలు, దేశవ్యాప్తంగా అంబరమంటే సంబరాల మధ్య, ఊరూరా రావణ దహన కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. రావణుడు అన్యాయానికి, చెడుకు ప్రతీక రాముడు ధర్మానికి, సత్యానికి నిలువెత్తు రూపం అని పసిపిల్లల నుంచి పండితుల వరకూ అందరికీ సుపరిచితమే. కానీ ఇక్కడో అత్యంత ఆశ్చర్యకరమైన, విచారకరమైన సామాజిక వాస్తవాన్ని మనం గమనించాలి. ఏటేటా రావణుడిని భారీ బొమ్మల రూపంలో దహనం చేస్తున్న ఈ ఆధునిక సమాజం, తన అంతరంగంలో గూడుకట్టుకున్న రావణత్వాన్ని మాత్రం ఏనాడూ దహనం చేసుకోవడం లేదు. ఈ వైరుధ్యమే ప్రస్తుత సమాజం ముందున్న అతిపెద్ద ప్రశ్న. రామాయణాన్ని వేల ఏళ్లుగా పారాయణం చేస్తూ, భక్తితో అర్చిస్తూ, పాఠ్యాంశాలుగా బోధిస్తున్నప్పటికీ, ఈ సమాజం రావణుడి దుర్లక్షణాలను ఎందుకు వదులుకోలేకపోతోంది? ఎక్కడ లోపం జరుగుతోంది?ప్రస్తుత రోజుల్లో రామాయణాన్ని చదవడం వేరు, దాని అంతరార్థాన్ని జీర్ణించుకోవడం వేరు అనే సత్యం స్పష్టమవుతోంది. నేటి సమాజంలో రామాయణం కేవలం ఒక ఆచారంగా, సాంప్రదాయ ప్రక్రియగా మాత్రమే మిగిలిపోయింది. నవరాత్రుల వేళ పారాయణాలు చేయడం, పండుగలకు హరికథలు, ప్రవచనాలు వినడం, పూజా మందిరాల్లో చిత్రపటాలను అలంకరించుకోవడం వంటివన్నీ బాహ్య భక్తికి సంబంధించిన అంశాలే తప్ప, వ్యక్తిగత ఆత్మపరిశీలనకు సంబంధించినవి కావు. ఒక పవిత్ర గ్రంథాన్ని పూజించడం సులభమే కానీ, దాని సారాన్ని నిత్య జీవితంలో ఆచరణలో పెట్టడం కత్తిమీద సాము లాంటిది. రామాయణంలోని ప్రతి పాత్రా మానవాళికి ఒక విశిష్టమైన నైతిక పాఠాన్ని బోధిస్తుంది. కానీ ఆయా పాఠాలను పక్కవారికి, బాహ్య ప్రపంచానికి మాత్రమే అన్వయించి, మన సమాజం తమను తాము మినహాయించుకుంటోంది. రావణుడు అహంకారి, దుర్మార్గుడు అని వేలెత్తి చూపడం చాలా సులభం, కానీ నాలోని అహంకారం కూడా ఆ రావణత్వపు ఛాయే అని నిజాయితీగా అంగీకరించే ఆత్మవిమర్శ సమాజంలో లోపించింది.రావణాసురుడి సర్వనాశనానికి ప్రధాన కారణం అతడి మితిమీరిన అహంకారం. త్రిలోకాలను జయించిన తనకు మించిన శక్తిమంతుడు లేడని, తన వేదజ్ఞానానికి సాటి ఎవరూ లేరని అతడు విర్రవీగాడు. ఈ తీవ్ర అహంకారమే అతడిని వినయ విధేయతలను విస్మరించేలా చేసింది. నేటి సమకాలీన సామాజిక, రాజకీయ ముఖచిత్రాన్ని పరిశీలిస్తే, అధికార పీఠాలపై ఉన్నవారు, అపార సంపద కలిగినవారు, ఉన్నత పదవుల్లో ఉన్నవారు అదే తరహా అహంకారాన్ని, దర్పణాన్ని ప్రదర్శించడం నిత్యకృత్యమైపోయింది. తాము చేసే తప్పులను ఒప్పుకోకపోవడం, నిర్మాణాత్మక విమర్శలను సైతం సహించలేకపోవడం, భిన్నాభిప్రాయాలు వ్యక్తపరిచేవారిని శత్రువులుగా



చూడటం వంటివన్నీ రావణత్వపు ఆధునిక రూపాలే అనడంలో సందేహం లేదు. పురాణాల ప్రకారం రావణుడికి పది తలలు ఉన్నాయని చెబుతారు. కానీ ఆధునిక కోణంలో చూస్తే, అది కేవలం అతడి పాండిత్యానికి సంకేతం కాదు, సమాజంలో నేడు కనిపిస్తున్న బహుముఖ అహంకారానికి ప్రతీక అని చెప్పవచ్చు.

అంతేకాకుండా, రావణుడు కేవలం వ్యకిగత లోపాలున్నవాడు మాత్రమే కాదు, అతడు లంకాధిపతి. తన సార్వభౌమాధికారాన్ని ప్రజా సంక్షేమానికి కాకుండా, తన స్వార్థపూరిత కాంక్షల కోసం, వైభోగం కోసం వినియోగించాడు. ఈ దుర్లక్షణం నేటి రాజకీయాల్లో, పరిపాలనా యంత్రాంగంలో, వ్యాపార రంగంలో వ్యవస్థీకృతమై స్పష్టంగా గోచరిస్తోంది. అవినీతి అవధులు దాటడం, బంధుప్రీతి పెచ్చరిల్లడం, అధికార దుర్వినియోగానికి పాల్పడటం వంటివన్నీ రావణుడి పాలనా వైఫల్యాలకు నకళ్లు. ప్రజలు ఎన్నికల సమయంలో రాముడి వంటి ఆదర్శప్రాయమైన నాయకుడిని ఆశిస్తారు, కానీ ఆచరణలో మాత్రం రావణుడి లక్షణాలున్న వ్యక్తులకే పట్టం గడుతుంటారు. ఇక్కడ సమాజం తనను తాను మోసం చేసుకుంటోందనే కఠిన సత్యాన్ని అంగీకరించక తప్పదు.

రామాయణ మహాకావ్యంలో సీతాపహరణం అత్యంత కీలకమైన, టర్నింగ్ పాయింట్ లాంటి ఘట్టం. ఒక స్త్రీని ఆమె అనుమతి లేకుండా, బలాత్కారంగా అపహరించడం, ఆమె అభీష్టానికి వ్యతిరేకంగా తన భోగ వస్తువుగా మార్చుకోవాలని చూడటమే రావణుడి పతనానికి నాంది పలికింది. దురదృష్టవశాత్తూ, నేటి ఆధునిక, సాంకేతిక సమాజంలోనూ స్త్రీల పట్ల అదే రకమైన పాశవిక దృక్పథం రూపాంతరం చెంది కొనసాగుతోంది. నిత్యం వార్తాపత్రికల్లో చూస్తున్న అత్యాచారాలు, లైంగిక వేధింపులు, గృహహింస, కార్యాలయాల్లో అసమానతలు, మహిళలపై జరుగుతున్న దాడుల వెనుక ఉన్నది ఒకటే మనస్తత్వం. అది స్త్రీని ఒక సమాన గౌరవం గల వ్యక్తిగా కాక, పురుషాధిక్యతకు లోబడాల్సిన ఒక వస్తువుగా చూసే వికృత ధోరణి. ఉదయం పూట సీతాదేవిని దైవంగా కొలిచి, లలితా సహస్రనామాలు పఠించే సమాజమే, నిత్య జీవితంలో తోటి మహిళలకు కనీస రక్షణ, గౌరవం కల్పించడంలో ఘోరంగా విఫలమవ్వడం దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద వైరుధ్యం.నేటి పాఠశాలల్లో, విద్యాసంస్థల్లో రామాయణ, భారతాల కథలను బోధిస్తున్నారు. పరీక్షల్లో మార్కుల కోసం విద్యార్థులు ఆయా ప్రశ్నలకు సమాధానాలు రాస్తున్నారు. కానీ ఈ మొత్తం విద్యా ప్రక్రియ కేవలం సమాచార మార్పిడిగా మిగిలిపోతోంది తప్ప, నైతిక విలువల ఆంతరికీకరణగా రూపాంతరం చెందడం లేదు. నైతిక విద్యాబోధన అంటే కేవలం కథలను వల్లె వేయడం కాదు, ఆ కథల్లోని అంతర్లీన సందేశాలను నిత్య జీవితంలోని క్లిష్ట పరిస్థితులకు అన్వయించుకోవడం నేర్పడం. మన ప్రస్తుత విద్యా విధానం కేవలం ర్యాంకులు, ఉద్యోగాల వేటపైనే దృష్టి పెడుతోంది కానీ, విద్యార్థి చారిత్రక పరివర్తనపై దృష్టి పెట్టడం లేదు. అందుకే సమాజంలో ఉన్నత చదువులు చదివిన వారు, పెద్ద ఉద్యోగాలు చేస్తున్న వారు సైతం, అనైతిక మార్గాలను ఎంచుకోవడం మనం చూస్తున్నాం.దీనికి తోడు, నేటి ఆధునిక సమాజంలో ప్రసార మాధ్యమాలు, చలనచిత్రాలు, సామాజిక మాధ్యమాలు పోషిస్తున్న పాత్ర కూడా విస్మరించలేనిది. నేటి పాపులర్ కల్చర్ తరచుగా హింసను, ప్రతీకారాన్ని, బాహుబలాన్ని గ్లోరిఫై చేస్తోంది. బలవంతుడే ఇక్కడ విజేత అనే తప్పుడు సందేశాన్ని పదే పదే యువత మనసుల్లో నాటుతున్నారు. ఈ క్రమంలో ధర్మం కంటే బలానికి, న్యాయం కంటే తాత్కాలిక విజయానికి ప్రాధాన్యత పెరుగుతోంది. రావణుడు కూడా అపరిమితమైన బలవంతుడే, కానీ అతడి బలం ధర్మాశ్రయం లేనిది కాబట్టే పతనమయ్యాడు అనే సూక్ష్మ భేదాన్ని నేటి తరం విస్మరిస్తోంది.ఈ తీవ్ర సామాజిక రుగ్మతకు పరిష్కారం రామాయణాన్ని ఇంకాస్త ఎక్కువగా చదవడంలో లేదు, దానిని ఒక భిన్నమైన సామాజిక కోణంలో చదవడంలో ఉంది. ప్రతి పాఠకుడూ, ప్రతి పౌరుడూ బాహ్య ప్రపంచాన్ని విమర్శించడం పక్కన పెట్టి, తనను తాను రావణుడి స్థానంలో ఉంచుకుని ఆత్మవిమర్శ చేసుకోవాలి.నాలో అహంకారం, స్వార్థం ఏ మేరకు ఉన్నాయి?నేను తోటి సమాజంలోని వ్యక్తుల హక్కులను, ముఖ్యంగా స్త్రీల గౌరవాన్ని కాపాడుతున్నానా?నాకున్న పరిధిలో అధికారాన్ని సక్రమంగా వాడుతున్నానా లేదా?ఇలాంటి నిర్మాణాత్మకమైన అంతఃశోధన లేకుండా, కేవలం ఏటా దసరా రోజున రావణుడి కాగితపు బొమ్మలను తగలబెట్టడం వల్ల సమాజంలో ఎలాంటి మార్పూ రాదు. బాహ్యంగా ఉన్న బొమ్మను తగలబెట్టడం చాలా సులభం, కానీ మనస్సుల్లో వేళ్లూనుకున్న రావణత్వపు ఆలోచనలను గుర్తించి, వాటిని నిర్మూలించుకోవడమే నిజమైన విజయదశమి. రామాయణం కేవలం ఒక పురాతన గ్రంథం కాదు, అది మానవ స్వభావానికి అద్దం పట్టే సజీవ దర్పణం. రాముడు, రావణుడు ఇద్దరూ మన అంతరంగంలోనే నివసిస్తున్నారు. ఏ పాత్రను మనం ఉద్దీపన చేసుకుంటామనేది మన నిత్య జీవిత ఎంపికలపైనే ఆధారపడి ఉంటుంది. కథను కేవలం శ్రవణం చేయడం నుంచి, కథను ఆచరణాత్మకంగా జీవించడం వైపు అడుగులు పడినప్పుడే సమాజం రావణత్వాన్ని విడిచిపెట్టి, రామరాజ్యం వైపు పయనిస్తుంది.



డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

# పాలకపక్షం – ప్రతిపక్షం... ఏం డ్రామాలు రా నాయనా..!

అబద్ధాల పునాదులపై నిర్మించిన నిరంకుశాధికార కోట ఎంత బలంగా కనిపించినా, సత్యం అనే తుఫాను ముందు ఎప్పటికైనా కూలిపోక తప్పదు. ప్రజల విశ్వాసాన్ని నిజాయితీతో కాదు, ఆకర్షణీయమైన వాగ్దానాలతో, భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రసంగాలతో, అసత్య ప్రచారాలతో సంపాదించిన అధికారం శాశ్వతం కాదు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ న్యాయమూర్తులు. కొంతకాలం ప్రజలను మభ్యపెట్టవచ్చు, ప్రత్యర్థులను అధికార యంత్రాంగంతో ఇబ్బందులకు గురిచేయవచ్చు, విమర్శలను అణచివేయవచ్చు. కానీ వాస్తవాలను ఎప్పటికీ దాచిపెట్టడం ఎవరి వల్లా సాధ్యం కాదు.

అధికారాన్ని ప్రజాసేవకు బదులుగా రాజకీయ ఆయుధంగా మార్చి, విభేదించే స్వరాలను అణచివేయడం, ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరచడం, విమర్శించే వారిని శత్రువులుగా చిత్రీకరించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతాలు. ప్రజాస్వామ్యం వ్యక్తులపై కాదు, విలువలపై నిలబడుతుంది. రాజ్యాంగం, చట్టాలు, ప్రజాభిప్రాయం కంటే ఎవరూ గొప్పవారు కారు. తాత్కాలిక అధికార మదంతో ప్రజల ఆత్మగౌరవాన్ని, వారి ఆశలను, వారి నమ్మకాన్ని తక్కువ అంచనా వేస్తే, చివరికి అదే ప్రజలు బ్యాలెట్ ద్వారా గట్టి సమాధానం చెబుతారు.చరిత్ర చెబుతున్న సత్యం ఒక్కటే—అబద్ధాలు కొంతదూరం మాత్రమే పరిగెత్తగలవు, సత్యం ఆలస్యమైనా గమ్యాన్ని చేరుతుంది. ప్రచార హోరు, వ్యక్తి ఆరాధన, అధికార అహంకారం, రాజకీయ ప్రతీకారాలు కొంతకాలం విజయవంతమైనట్లుగా కనిపించవచ్చు. కానీ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురాని పాలన, జవాబుదారీతనం లేని నాయకత్వం, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన రాజకీయ వ్యవస్థ ఎక్కువకాలం నిలవదు. ప్రజాస్వామ్యంలో చివరికి గెలిచేది అధికార దర్పం కాదు, ప్రజల తీర్పే. అదే చరిత్ర ఇచ్చిన గుణపాఠం, అదే ప్రతి పాలకుడు ఎప్పటికీ గుర్తుంచుకోవాల్సిన శాశ్వత సత్యం. ఇక తెలంగాణ రాజకీయాలను ఈ మధ్యకాలంలో గమనిస్తున్న ప్రతి ఒక్కరికీ ఒక ప్రశ్న కలుగుతోంది. రాష్ట్రం ఎదుర్కొంటున్న అసలు సమస్యలు ఎక్కడ? ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అంశాలపై చర్చ ఎక్కడ? అధికార పక్షం–ప్రతిపక్షం మధ్య జరుగుతున్న రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు, మీడియా ముందు సవాళ్లు, ప్రతిసవాళ్లు, పోలీసుల జోక్యం, బహిరంగ చర్చల పేరుతో జరుగుతున్న రాజకీయ నాటకాలే ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, ఉపాధి, విద్య, వ్యవసాయం, ఆర్థిక పరిస్థితి వంటి ప్రధాన అంశాలు పక్కకు వెళ్లిపోతుండగా, రాజకీయ ప్రచారమే ప్రధాన అజెండాగా మారడం ఆందోళన కలిగించే విషయం.

ప్రజాస్వామ్యంలో అధికార పక్షానికి పాలించే బాధ్యత ఉంటే, ప్రతిపక్షానికి ప్రశ్నించే బాధ్యత ఉంటుంది. కానీ నేడు తెలంగాణ రాజకీయాలను పరిశీలిస్తే ఈ రెండు బాధ్యతలు కూడా పక్కనపెట్టి ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకోవడం, రాజకీయంగా పైచేయి సాధించడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది. రాజకీయ నాయకులు ప్రజలకు ఆదర్శంగా ఉండాలి. వారి మాటల్లో హుందాతనం, వాస్తవాలు, బాధ్యత కనిపించాలి. కానీ ప్రస్తుతం రాజకీయ సంభాషణలో వ్యక్తిగత విమర్శలు, పరుష పదజాలం, సంచలన వ్యాఖ్యలు, ఒకరిని మరొకరు అవమానించే ధోరణి ఎక్కువైపోయింది. దీనివల్ల ప్రజాస్వామ్య రాజకీయాలపై ప్రజల్లో విశ్వాసం దెబ్బతింటోంది.గత రెండు రోజులుగా రాష్ట్ర రాజకీయాలను వేడెక్కించిన కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ మధ్య జరిగిన పరిణామాలు ఇందుకు తాజా ఉదాహరణ. బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్ రావు, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్ గౌడ్, తదితరులు కాంగ్రెస్ ప్రభుత్వంపై రెండు ప్రధాన ఆరోపణలు చేశారు. రాష్ట్ర అప్పుల భారం పెరిగిందని, గత ప్రభుత్వ అప్పులపై ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఒక ఆరోపణ. మరోవైపు గురుకుల విద్యాసంస్థల్లో యూనిఫాంలు, షూస్, స్కూల్ బ్యాగులు, ఆహార సరఫరా వంటి కొనుగోళ్లలో సుమారు రూ.2,000 కోట్ల మేర అక్రమాలు జరిగాయని ఆరోపించారు. గతంలో అమలైన వికేంద్రీకృత కొనుగోలు విధానాన్ని మార్చి, స్థానిక మహిళా సంఘాలు, చిన్న పరిశ్రమలకు అవకాశాలు లేకుండా బయట రాష్ట్రాల సంస్థలకు కేంద్రీకృత టెండర్లు ఇచ్చారని విమర్శించారు.

ఈ ఆరోపణల నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు బహిరంగ చర్చకు సవాల్ విసిరారు. కాంగ్రెస్ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, మహమ్మద్ అజారుద్దీన్, తదితరులు ఆ సవాల్‌ను స్వీకరిస్తూ గన్‌పార్క్ వద్ద చర్చకు సిద్ధమయ్యారు. అయితే బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ భవన్ నుంచి బయలుదేరిన సమయంలో పోలీసులు వారిని అడ్డుకోవడంతో రాజకీయ వాతావరణం మరింత ఉద్రిక్తంగా మారింది. బీఆర్ఎస్ దీనిని ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘనగా అభివర్ణించగా, కాంగ్రెస్ మాత్రం చర్చకు తాము సిద్ధంగా ఉన్నప్పటికీ బీఆర్ఎస్ వెనక్కి తగ్గిందని ఆరోపించింది. అనంతరం బీఆర్ఎస్ నాయకులు విడుదలైనా అప్పటికే రాజకీయంగా రెండు పార్టీలు తమ తమ వాదనలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశాయి.

ఈ మొత్తం ఘటనలో అసలు చర్చ జరగాల్సిన అంశాలు మాత్రం మరుగునపడ్డాయి. రాష్ట్ర అప్పులు ఎంత ఉన్నాయి? వాటి నిర్వహణ ఎలా జరుగుతోంది? గురుకులాల్లో టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా జరిగిందా లేదా? వికేంద్రీకృత కొనుగోలు విధానం వల్ల లాభాలేమిటి? కేంద్రీకృత విధానం వల్ల నష్టాలేమిటి? ప్రభుత్వానికి ఆర్థికంగా ఏ విధానం ప్రయోజనకరం? స్థానిక ఉపాధిపై దాని ప్రభావం ఎంత? వంటి ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉండగా, చర్చ మొత్తం రాజకీయ ప్రదర్శనగా మారిపోయింది.

ప్రజలు రాజకీయ నాయకుల మధ్య జరిగే మాటల యుద్ధాలను కంటే, ఆధారాలతో కూడిన వాస్తవాలను తెలుసుకోవాలనుకుంటున్నారు. ఆరోపణలు చేసినవారు ఆధారాలు చూపాలి. ప్రభుత్వం కూడా పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలి. పారదర్శకత అంటే ప్రత్యర్థిని విమర్శించడం కాదు; ప్రజలకు నిజాలను తెలియజేయడం. అదే ప్రజాస్వామ్యానికి బలం.

పోలీసుల పాత్ర కూడా ఈ సందర్భంలో చర్చనీయాంశమైంది. ప్రజాస్వామ్యంలో శాంతిభద్రతలను కాపాడటం పోలీసుల బాధ్యత. అయితే రాజకీయ కార్యక్రమాల విషయంలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం ప్రజల్లో కలగకూడదు. అలాంటి పరిస్థితి ఏర్పడితే ప్రతిపక్షాలకు బాధితులమనే భావనను ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం లభిస్తుంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం విమర్శలను ఎదుర్కోవాలి కానీ వాటిని అణచివేస్తోందనే అనుమానానికి తావు ఇవ్వకూడదు.

ఇక కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలు విషయంలో ప్రజలు స్పష్టమైన సమాధానాలు కోరుతున్నారు.అధికారంలోకి వచ్చిన వెంటనే 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాం, వాటిని చట్టబద్ధం చేస్తామని ఆ పార్టీ అగ్రనేతలు హామీ ఇచ్చారు. రెండున్నరేండ్లు గడుస్తున్నా వాటి ఊసే లేదు. ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రజాపాలన, ప్రగతి నివేదిక పేరుతో గ్రామసభలు, ఇతర కార్యక్రమాలు చేపడుతున్నది. రైతుభరోసా ఎగ్గొట్టింది. రుణమాఫీ చేయలేదు. ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వలేదు. మూసీ సుందరీకరణ, హైడ్రా పేరిట పేదల ఇండ్లను కూల్చివేసింది. కళ్యాణలక్ష్మి, తులం బంగారం ఎగ్గొట్టింది. నిరుద్యోగులకు ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలని నమ్మబలికి సుమారు 16 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చింది. ఆసరా పింఛన్లు రూ.4 వేల నుంచి రూ.6 వేలు చేస్తానని చెప్పిన మాట నిలబెట్టుకోలేదు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2,500, నిరుద్యోగులకు రూ.4 వేల భృతి ఊసెత్తడం లేదు. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డులు, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, మహిళలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలను ఎగ్గొట్టింది. కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేలు, రైతు కూలీలకు, ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని చెప్పి మోసం చేసింది. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, రూ.12 లక్షల దళిత బంధును నిలిపివేసింది. సంక్షేమ గురుకుల పాఠశాలలను గాలికి వదిలేయడం చూస్తే ఇది పూర్తిగా ప్రజాకంటక పాలనగా మారింది.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యాచరణగా మారాలి. ఆ హామీల అమలు ఎంతవరకు జరిగింది? ఇంకా ఏవి మిగిలాయి? వాటికి గడువు ఏమిటి? ప్రజలకు ప్రభుత్వం చెప్పాల్సిన బాధ్యత ఉంది. అధికారంలో ఉన్న పార్టీ తన పాలన ద్వారా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలి. ప్రతిపక్షం కూడా ఆ హామీల అమలుపైనే ప్రభుత్వాన్ని నిలదీయాలి. అదే ప్రజాస్వామ్య ప్రతిపక్ష ధర్మం.దురదృష్టవశాత్తు, అసెంబ్లీ వంటి అత్యున్నత వేదికలలో జరగాల్సిన చర్చలు మీడియా కెమెరాల ముందు జరుగుతున్నాయి. ప్రజల సమస్యలపై గంటల తరబడి చర్చించాల్సిన సభలు కొన్నిసార్లు రాజకీయ నినాదాలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. అసెంబ్లీలో గణాంకాలు, ఆధారాలు, నివేదికలు, ప్రభుత్వ సమాధానాలు రికార్డులో ఉంటాయి. కానీ బయట జరిగే రాజకీయ వాదోపవాదాలు కేవలం ప్రచారానికే ఉపయోగపడతాయి. ప్రజలకు కావాల్సింది ప్రచారం కాదు, పరిష్కారం.బీజేపీ నాయకుడు బండి సంజయ్ ఈ వ్యవహారాన్ని "బిగ్‌బాస్ షో"గా వ్యాఖ్యానించడం కూడా ఈ రాజకీయ పరిణామాలపై ప్రజల్లో ఏర్పడుతున్న భావనకే ప్రతిబింబంగా చెప్పవచ్చు. నిజంగానే ప్రజలకు కొన్ని సందర్భాల్లో రాష్ట్ర రాజకీయాలు సమస్యల పరిష్కార వేదికలా కాకుండా, ఒకరినొకరు మించిపోయే రాజకీయ ప్రదర్శనలా కనిపిస్తున్నాయి. కానీ ప్రజలు ఇప్పుడు గతంలో ఉన్నంత అమాయకులు కాదు. సోషల్ మీడియా, సమాచార విప్లవం కారణంగా ప్రతి అంశాన్ని విశ్లేషించే స్థాయికి చేరుకున్నారు. కేవలం నినాదాలు, ఆరోపణలు, భావోద్వేగాలతో ప్రజలను ఎక్కువకాలం ప్రభావితం చేయడం సాధ్యం కాదు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దానికి పైగా గడిచింది. ఇప్పుడు రాష్ట్రానికి కావాల్సింది అభివృద్ధి రాజకీయాలు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు, రైతుల ఆదాయం, విద్య, వైద్యం, పట్టణాభివృద్ధి, గ్రామీణ మౌలిక వసతులు, సామాజిక న్యాయం వంటి అంశాలపై అధికార పక్షం, ప్రతిపక్షం పోటీ పడాలి. ఎవరు ఎక్కువగా ప్రజల కోసం పనిచేస్తున్నారో నిరూపించుకోవాలి. కానీ నేడు వ్యక్తిగత విమర్శలు, రాజకీయ ప్రదర్శనలు, మీడియా ఈవెంట్లు ఎక్కువగా కనిపించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు.

గత 78 సంవత్సరాల భారత రాజకీయ చరిత్రను పరిశీలిస్తే ప్రజలు ఎన్నో రాజకీయ నాటకాలను చూశారు. ఎన్నికల ముందు హామీలు, ఎన్నికల తర్వాత మరచిపోవడం కూడా కొత్త విషయం కాదు. అందుకే నేడు ప్రజలు మాటలను కాకుండా చేతలను విశ్వసిస్తున్నారు. ఎవరు ఎంత గట్టిగా మాట్లాడారన్నది కాదు, ఎవరు ఎంత నిజాయితీగా పనిచేశారన్నదే ప్రజల తీర్పును నిర్ణయిస్తుంది.

ప్రతిపక్షం అంటే కేవలం నిరసనలు చేయడం కాదు. ప్రభుత్వ తప్పులను ఆధారాలతో బయటపెట్టడం, ప్రత్యామ్నాయ విధానాలను సూచించడం, ప్రజల తరఫున చట్టసభల్లో బలంగా వాదించడం. అలాగే అధికార పక్షం అంటే విమర్శలను తిరస్కరించడం కాదు. వాటికి వాస్తవాలతో సమాధానం చెప్పడం, అవసరమైతే తప్పులను సరిదిద్దుకోవడం. ఈ రెండు బాధ్యతలు సమర్థంగా నిర్వర్తించినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది.

ప్రస్తుతం తెలంగాణ ప్రజలు రాజకీయ నాయకుల నుంచి కోరుకుంటున్నది ఒక్కటే. ఆరోపణలు, ప్రత్యారోపణలు, బహిరంగ సవాళ్లు, పోలీసు వివాదాలు, రాజకీయ డ్రామాలకు ముగింపు పలికి, ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలి. అసెంబ్లీని ప్రజా సమస్యల పరిష్కార వేదికగా మార్చాలి. ఎన్నికల హామీల అమలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, విద్యా వ్యవస్థ, ఉపాధి అవకాశాలు, రైతుల సంక్షేమం వంటి అంశాలపై నిర్మాణాత్మక చర్చలు జరగాలి. అదే ప్రజలకు ఉపయోగపడే రాజకీయ సంస్కృతి.

ప్రజాస్వామ్యంలో చివరి తీర్పు ప్రజలదే. ఎంతటి రాజకీయ ప్రదర్శనలు చేసినా, ఎంతటి ప్రచారాలు నిర్వహించినా, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురాని రాజకీయాలను వారు ఎక్కువకాలం ఆదరించరు. తెలంగాణ ప్రజలు ఇప్పుడు రాజకీయ పరిపక్వతతో ఉన్నారు. వారికి కావాల్సింది డ్రామాలు కాదు, బాధ్యతాయుతమైన పాలన. ఆరోపణలు కాదు, ఆధారాలు. ప్రచారం కాదు, ప్రజా ప్రయోజనం. అధికార పక్షమైనా, ప్రతిపక్షమైనా ఈ వాస్తవాన్ని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. లేదంటే రాజకీయ వేదికలపై వినిపించే హడావుడికి చప్పట్లు పడినా, ఎన్నికల వేళ ప్రజల తీర్పు మాత్రం పూర్తిగా భిన్నంగా ఉండే అవకాశాన్ని ఎవరూ విస్మరించరాదు.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు



ఫతేపూర్ లో అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ షెడ్లు

# అడ్డగోలుగా షెడ్ల నిర్మాణం

- అధికారుల నిరక్ష్యం...
- అభివృద్ధికి అడ్డంకులు
- మున్సిపల్ ఆదాయానికి గండి

**శంకర్పల్లి, వెలుతురు జూలై 18 :**

మున్సిపల్ పరిధిలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా అక్రమ షెడ్ల నిర్మాణాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. నిబంధనలను బేఖాతరు చేస్తూ రోడ్ల పక్కన రేకుల షీట్లతో షెడ్ల నిర్మా ణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో మున్సిపాలిటీ పరిధిలో అనధికార నిర్మాణాలు విస్తరిస్తూ పట్టణ అభివృద్ధికి అడ్డంకిగా మారుతున్నాయి. ఇటీవల మున్సిపాలిటీ పరిధి లో వాణిజ్య దుకాణాల అద్దెలు గణనీయంగా పెరగడంతో కొందరు స్థల యజమానులు ఈ పరిస్థితిని అవకాశంగా మలుచు కుంటున్నారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్రధాన రహదారుల వెంట తక్కువ ఖర్చుతో రేకుల షెడ్లను నిర్మించి అద్దెకు ఇస్తున్నారు. అనంతరం వాటికి లక్షల రూపాయల అడ్వాన్సులతో పాటు, నెలకు వేల రూపా యల అద్దెలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ప్రత్యేకంగా హైదరా బాద్-శం కర్పల్లి ప్రధాన రహదారి, చేవెళ్లరోడ్డు, సంగారెడ్డి, వికారా బాద్ రోడ్డు పరిసర ప్రాంతాలలో ఇటువంటి అక్రమ షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పట్టణ ప్రణాళిక నిబం ధనలకు విరుద్ధంగా నిర్మాణాలు సాగుతున్నప్పటికీ అధికారులు పట్టించు కోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ నిర్మా ణాల కారణంగా మున్సిపాలిటీకి రావల్సిన పలు రకాల అనుమతి ఫీజులు, అభివృద్ధి ఛార్జీలు, ఇతర ఆదాయ వనరులు కోల్పోతుందని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ఇప్పటికే నిర్మించిన షెడ్ల సముదాయాల నుంచి వెలువడుతున్న డ్రైనేజీ నీరు రోడ్లపైకి చేరి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. వర్షాకా లంలో ఈ సమస్య మరింత తీవ్రమై రోడ్లపై నీరు నిల్వ ఉండడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని స్థాని కులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణ, పారిశుధ్య సమస్యలు కూడా పెరుగుతున్నాయని అంటున్నారు. అక్రమ నిర్మాణాలపై సమగ్ర సర్వే నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన షెడ్లపై చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి నిర్మాణాలకు అడ్డుకట్ట వేయా లని ప్రజలు అధికారులను కోరుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి అక్రమ నిర్మాణాలను నియం త్రించకపోతే పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.




నోటీసులు జారీ చేశాం

యోగేష్, మున్సిపల్ కమిషనర్

అక్రమ షెడ్ల నిర్మాణాలపై ఇప్పటికే నోటీ సులు జారీ చేశాం. వారు స్పం దించక పోతే రెండు, మూడు రోజుల్లో అక్రమ షెడ్ల నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం. ఇలాంటి అక్రమ షెడ్ల నిర్మాణాల గురుంచి తెలిస్తే మా దృష్టికి తీసుకరండి.

# శంకర్‌పల్లిలో అభివృద్ధి పనుల జోరు

- ఎమ్మెల్యే కాలే యాదయ్య శంకుస్థాపనలు
- రూ. 25.90 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- 35 మందికి రూ. 16.25 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**శంకర్ పల్లి, వెలుతురు జులై 18 :**





చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని శంకర్‌పల్లి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడమే లక్ష్యంగా స్థానిక శాసనసభ్యులు శ్రీ కాలే యాదయ్య పలు నూతన పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులలో పర్యటించిన ఆయన, మొత్తం రూ. 25.90 లక్షల నిధులతో చేపట్టనున్న పలు మౌలిక వసతుల పనులకు భూమిపూజ చేశారు.

## వార్డుల్లో అభివృద్ధి పనుల వివరాలు

మొదటగా మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో రూ.10 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఫతేపూర్ ఎస్సీ కాలనీలో రూ.10.90 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తదుపరి 11వ వార్డులో రూ.5 లక్షల నిధులతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు కూడా ఆయన భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పనులను నిర్ణీత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## ఆపదలో ఉన్నవారికి సీఎంఆర్ఎఫ్ భరోసా

అనంతరం శంకర్‌పల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొన్నారు. మండలం, మున్సిపాలిటీ పరిధికి చెందిన 35 మంది నిరుపేద లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.16,25,500 విలువైన ఆర్థిక సహాయం చెక్కులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు.

## ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు, ఆపదలో ఉన్న పేద, నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక చేయూత అందించడం రాష్ట్ర ప్రభుత్వం యొక్క సంక్షేమ పాలనకు నిదర్శనమని కొనియాడారు. చేవెళ్ల నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, ప్రజల అవసరాలను గుర్తించి ప్రతి అభివృద్ధి పనిని దశలవారీగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక మున్సిపల్ ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ కార్యాలయంలో 'SIR' ఓటర్ల సవరణ ఫారమ్‌లపై కీలక సమీక్ష – క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాలని డివిజన్ అధ్యక్షులకు పిలుపు

**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి జూలై 18:**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ స్థాయి కీలక సమీక్షా సమావేశం జరిగింది.కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వైస్ చైర్మన్, మేడ్చల్ పార్లమెంట్ కాంగ్రెస్ కనెక్ట్ ఇంచార్జి పొన్నాడ సుబ్రహ్మణ్యం ప్రసాద్, మేడ్చల్–మల్కాజ్‌గిరి పార్లమెంట్ కో–ఆర్డినేటర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల అధ్యక్షులతో కలిసి వారు SIR (Special Intensive Revision) ఎన్యుమరేషన్ ఫారమ్‌లపై సుదీర్ఘంగా చర్చించి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్య నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన SIR (Special Intensive Revision) ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై డివిజన్ అధ్యక్షులకు, పార్టీ శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి డివిజన్‌లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, ఓటరు జాబితాలోని తప్పులను సరిదిద్దేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పని చేయాలని పిలుపునిచ్చారు.అలాగే ఎన్నికల సంఘం జారీ చేసిన SOP (Standard Operating Procedure) ప్రకారం ప్రతి బూత్ పరిధిలో ఎన్యుమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ, పరిశీలన మరియు ఓటర్లకు అవగాహన కల్పించే కార్యక్రమాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు.అనంతరం ఎన్యుమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ, పరిశీలన, ఓటర్లకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై నాయకులకు సూచనలు చేశారు. SIR ప్రక్రియను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,డివిజన్ అధ్యక్షులు,కార్యకర్తలు మరియు ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# నిజాంపేట్ తుర్క చెరువు అభివృద్ధి పనులను పరిశీలించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి జూలై 18:**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి నిజాంపేట్ తుర్క చెరువు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు పరిసర ప్రాంతాలను సందర్శించి, జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించడంతో పాటు స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.అనంతరం వారు మాట్లాడుతూ, తుర్క చెరువు అభివృద్ధి పర్యావరణ పరిరక్షణకు ఎంత ముఖ్యమో, అదే స్థాయిలో దశాబ్దాలుగా అక్కడ నివసిస్తున్న పేద కుటుంబాల జీవన హక్కులను కూడా పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అభివృద్ధి పేరుతో నిరుపేదల ఇళ్లను కూల్చివేయడం కాకుండా, మానవతా దృక్పథంతో సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులను కోరారు.ప్రజల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధి ఈ మూడు సమాన ప్రాధాన్యంతో ముందుకు సాగాలని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి వారి హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తుందని కొలన్ హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు వరగాని వాసు, తాటి రెడ్డి, మురళి, మౌళేశ్వర్ రావు, రఫియా బేగం, చిట్ల దివాకర్, వీరేష్, ఇందిర కడియాల, నాగరాజ్, సాయి, బాల బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

# ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశా లను సందర్శించిన తెలంగాణ రాష్ట్ర మంత్రి మహమ్మద్ అజారద్దీన్

- ఆరుట్ల తెలంగాణ పాఠశాల నిర్మాణం అద్భుతంగా ఉంది విద్యార్థులు విద్యలో క్రీడల్లో బాగా రాణించాలి
- తెలంగాణ రాష్ట్ర మంత్రి మహమ్మద్ అజారద్దీన్

**మంచాల వెలుతురు జూలై 18:**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ పాఠశాల సందర్శించిన తెలంగాణ రా ష్ట్రమంత్రి అజారుద్దీన్ రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి ముందుగా మంత్రి అజార్ దీ న్ కుస్వాగతం పలికిన తెలంగాణ పాఠశాల ప్రిన్సిపాల్ సిద్ధగొని గిరిధర్ గౌడ్ పాఠశాల సిబ్బంది గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్,కాంగ్రెస్ పార్టీ రా ష్ట్రనాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బారారాజ్ ముదిరాజ్ ప్రధానకార్యదర్శి చిందం శ్రీశైలం గ్రామపంచాయతీ పాలకమండలి సభ్యులు అనం తరం ఆరుట్ల తెలంగాణపాఠశాలలో ఉన్నతరగతిగదులను క్రీడామైదా నాలను పరిశీలించివిద్యా ర్థులతో ఆప్యాయంగా ముచ్చటించి విద్యార్థులతో క్రికెట్ ఆడిన మంత్రి అజార్ దిన్ అనంతరం విద్యార్థులతో కలిసి నేలపైన కూర్చుని విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు ఈసందర్భంగా మాట్లాడుతూ ఆరుట్ల తెలంగాణ పాఠశాల నిర్మాణం.క్రీడా మైదానాలు తరగతి గదులు డైనింగ్ హాల్ చాలా అద్భుతంగా ఉన్నాయి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అన్ని సౌకర్యాలతో ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ పాఠశాల ఏర్పాటు కావడం చాలా సంతోషంగా ఉంది అని అన్నా రు విద్యార్థులు బాగా చదివి విద్యలో క్రీడలో బాగా రాణించాలి గ్రామానికి మంచిపేరు తేవాలి అని అన్నారుయువత మద్యపానానికి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి అని అన్నారు విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఆదనపు జిల్లాకలెక్టర్ కిరణ్మయి అధికారులు ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జలవర్ష రాములు ఇబ్రహీంపట్నం ఆర్డిఓ శ్రీనివాస్ రెడ్డి మంచాల తహసిల్దార్ వెంకటప్రసాద్ రావు ఎంపీడీవో వసంత లక్ష్మి ఆరుట్ల మాజీసర్పంచ్ ఆనం గల్ల యాదయ్య మాజీ ఎంపీటీసీ కావాలి శ్రీనివాస్ ముదిరాజ్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు మహ మ్మద్ సలాం వైయస్సార్ మాధగోనిజంగ య్యగౌడ్.నాయకులు.<

గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్ మారగోని మాసయ్యగౌడ్ గ్రామ పంచాయతీ వార్డుసభ్యులు కొండిగారి శ్రావణ్ అన్నంగళ్ళ జగ న్నాథం మంద మాధవి మోహన్ రెడ్డి మానిపాటి భానుప్రసాద్ మహమ్మద్ ఇమ్రాన్ మాడుగుల బాలమని కృష్ణగౌడ్ మొర్రిపద్మ ఐలయ్య లాలగారి మన్నెమ్మ ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణ ముదిరాజ్ మారలక్ష్మణ్ కంబాలపల్లి బుగ్గరాములు కోరే బాబు నాయకులు మర సురేష్ సుంకరి ప్రవీణ్ గౌడ్ కావలి శ్రీనివాస్ ముదిరాజ్ దాసరమోని రమేష్ ముదిరాజ్ తలారి కృష్ణ ముదిరాజ్ చిందం ఐలయ్య మాడపాకుల యాదగిరి ఎన్నుదుల సురేష్.దాసరమోని అశోక్ ము దిరాజ్ ఆడెపు మధు మహమ్మద్ గలాబ్ మహమ్మద్ ఇబ్రహీం మహమ్మద్ అష్రఫ్ దూసరి రాజు గౌడ్ రైనా ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు ప్రజాప్రతినిధులు పాఠశాల సిబ్బంది తో కలిసి తెలంగాణ రాష్ట్ర మంత్రి మహమ్మద్ అజారద్దీన్



ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాల క్రికెట్ మైదానంలో క్రికెట్ ఆడుతున్న రాష్ట్ర మంత్రి మహ మ్మద్ అజారుద్దీన్



ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి నేలపై కూర్చున్న తెలంగాణ రాష్ట్ర మంత్రి అజారుద్దీన్




ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాలలో ప్రసంగిస్తున్న మంత్రి మహమ్మద్ అజారుద్దీన్

# ఘనంగా మాజీ మంత్రి జన్మదిన వేడుకలు

**మునుగోడు,జూలై 18(వెలుతురు):**



తెలంగాణ ఉద్యమకారుడు ఉమ్మడి నల్గొండ జిల్లా అభివృద్ధి ప్రదాత మాజీ మంత్రివర్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో శనివారం బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు.అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి,బాణా సంచా పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు.అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు,జిల్లా,నియోజకవర్గ ,మండల నాయకులు,అభిమానులు,పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# బద్దుల సత్తయ్య దశదిన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ నేతకాని కృష్ణయ్య

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 18:**



మండల కేంద్రంలోని దోకూరి గార్డెన్స్‌లో చెర్వుగట్టు గ్రామానికి చెందిన బద్దుల సత్తయ్య దశదిన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెర్వుగట్టు సర్పంచ్ నేతకాని కృష్ణయ్య, దేవస్థాన చైర్మన్ వారాల రమేష్, మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ, ఉప సర్పంచ్ ఆమనగంటి జెలందర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ గడుసు శశిధర్ రెడ్డి పాల్గొని బద్దుల సత్తయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యుడు కూకుట్ల శ్రీకాంత్, మాజీ ఉప సర్పంచులు నారాయణ రెడ్డి, శంకర్ రెడ్డి, కూకుట్ల గణేష్, గాదె లింగయ్య, కట్ట రాజయ్య, కట్ట రమేష్, గదారి శంకర్, వనం శ్రీను, మేడి రామలింగయ్య, యశ్వంత్, కట్ట సాయి తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# గురుకుల పాఠశాలలో 'పోలీస్ అక్క' అవగాహన కార్యక్రమం

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 18:**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) ఆదేశాల మేరకు, అలాగే నల్లగొండ జిల్లా ఎస్పీ మార్గదర్శకత్వంలో నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నార్కట్ పల్లి ఎస్సైపందిరి విష్ణు'పోలీస్ అక్క' పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు మహిళలపై జరుగుతున్న నేరాలు, వ్యక్తిగత భద్రత, సైబర్ నేరాలు, సోషల్ మీడియాను సురక్షితంగా వినియోగించే విధానం, ఫేక్ అకౌంట్లు, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ బుల్లీయింగ్, స్టాకింగ్ వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.అలాగే అత్యవసర పరిస్థితుల్లో 112 (ఎమర్జెన్సీ), 1930 (సైబర్ మోసాల ఫిర్యాదులు), 181 (మహిళల హెల్ప్‌లైన్), 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్) నంబర్లను ఎలా వినియోగించాలో వివరించారు.ఈ సందర్భంగా మహిళలు, బాలికలు ఎలాంటి సమస్యలు ఎదురైనా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని, వారి భద్రత కోసం తెలంగాణ పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని అధికారులు తెలిపారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ కోసం దోస్త్ ఆన్లైన్ స్పెషల్ ఫేస్ రిజిస్ట్రేషన్

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 18:**



2026 – 27 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందడం కోసం దోస్త్ ఆన్లైన్ స్పెషల్ ఫేస్ రిజిస్ట్రేషన్ ఈనెల 20 నుండి 26 వరకు చేసుకోవచ్చని రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం తెలిపారు. ఇంతవరకు ఏ కళాశాలలో సీటు పొందని వారికి ఇది మంచి అవకాశమని తప్పకుండా వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిగ్రీ అడ్మిషన్లు పొందవలసిన వారు నేరుగా కళాశాల కార్యాలయంలో సంప్రదించగలరు. లేదా మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోగలరని ఆమె తెలిపారు.


# శివలింగ జల దిగ్బంధన మహోత్సవానికి భక్తులకు ఆహ్వానం

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 18:**

నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలోని శ్రీ గోవిందమాంబ సమేత జగద్గురు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి సన్నిధిలో ఈ నెల 20వ తేదీ (సోమవారం) శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి శివలింగ జల దిగ్బంధన మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థాన నిర్వాహకులు తెలిపారు.సకాలంలో వర్షాలు కురవడం, లోకక్షేమం, పంటల సమృద్ధి కోసం నిర్వహించే ఈ మహోత్సవం ఉదయం 8 గంటల నుంచి దేవస్థానం అర్చకులు బ్రహ్మశ్రీ ఉత్తరపల్లి అనంత ఆచార్యులు వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు, శివలింగ జల దిగ్బంధన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.ఈ కార్యక్రమాన్ని దేవస్థానం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ పెండోట సోము గారి ధర్మపత్ని శ్రీమతి ఉమా ప్రారంభించనున్నారు.ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వాహకులు, స్వామివారి అన్నప్రసాద కార్యక్రమం ఫౌండర్ గడగోజు సత్యనారాయణ చారి మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో వర్షాలు సమయానికి కురవక ప్రజలు, రైతులు, పశుపక్షులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సనాతన ధర్మశాస్త్రాల ప్రకారం పరమశివునికి జలాభిషేకం, శివలింగ జల దిగ్బంధనం చేయడం ద్వారా సకాలంలో వర్షాలు కురిసి, లోకక్షేమం, పంటల సమృద్ధి, ప్రజలకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలుగుతాయని పురాణాలు తెలియజేస్తున్నాయని అన్నారు.అందువల్ల భక్తులందరూ ఈ మహోత్సవానికి అధిక సంఖ్యలో హాజరై, ప్రత్యేక పూజల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దేవస్థాన నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# జగదీశ్వర్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా నిరుపేదలకు అన్నదానం

**మోత్కూర్, జులై 18,వెలుతురు న్యూస్ :**



మాజీ మంత్రి, ప్రస్తుత సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ కోక బిక్షం ఆధ్వర్యంలో శనివారం చెరువుగట్టు దేవస్థానం ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన సుమారు 100 మంది నిరుపేదలు, వృద్ధులు, భక్తులకు ప్రేమతో భోజనాలను పంపిణీ చేశారు. అన్నదానానికి ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి జగదీశ్వర్ రెడ్డి ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షు పొందాలని ప్రార్థించారు.అనంతరం డాక్టర్ కోక బిక్షం మాట్లాడుతూ, మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి నాయకత్వంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా సాగునీరు, తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం తదితర రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఆయన సేవలు కొనసాగాయని కొనియాడారు.అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు, నిరుపేదలు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలుపుతూ జగదీశ్వర్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా చేపట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు.

# వెల్లంకి గ్రామంలో నూతనంగా నిర్మించిన పల్లె దావకానను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి

- **గ్రామంలో మద్యపానం నిషేధించాలి.సిపిఎం**

**రామన్నపేటవె లుతురు న్యూస్ జూలై 18:**




వెల్లంకి గ్రామంలో నూతనంగా నిర్మించిన పల్లె దవఖానను పూర్తి చేసి ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సిపిఎం జిల్లా కమిటి సభ్యులు వనం ఉపేందర్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు,మాజీ సర్పంచ్ కూరెళ్ళ నర్సింహా చారి డిమాండ్ చేశారు. సిపిఎం వెల్లంకి గ్రామ శాఖ ఆధ్వర్యంలో గ్రామ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం పరిశీలించి, అనంతరం నూతనంగా నిర్మాణం చేసి ప్రారంబానికి నోచుకోని పల్లె దవాఖానను పరిశీలించి అనంతరం మాట్లాడుతూ నూతన పల్లె దావఖాన పూర్తి అయినా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావటం లేదని అన్నారు. ఆకతాయిలు కిటికీల అద్దాలు, తలుపులు ధ్వంసం చేసి మద్యం సేవించి సీసాలు పగలగొడుతున్నారని అన్నారు. దావఖానకు దారిని తీసి, ప్రారంభించి వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డాక్టర్ రెగ్యులర్ గా అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. గ్రామంలో పూర్తి మద్యపానా నిషేధం అమలు చేయాలని గ్రామ సర్పంచ్ కు వినతి.వెల్లంకి గ్రామంలో మద్యానికి బానిసలయ్యి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆరోగ్యాలు చెడిపోయి అనేక కుటుంబాలు రోడ్డున పడాల్సిన దుస్థితి ఏర్పడిందని కావున మద్యపాన నిషేధం విధిస్తూ గ్రామ పంచాయతీలో తీర్మానం చేయాలని గ్రామ సర్పంచ్ ఏడెం రాధ కు సిపిఎం పార్టీగా వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటి సభ్యులు ఆవనగంటి నగేష్,మాజీ ఎంపిటీసీ లు బర్లబాబు రావు, ఎర్రోళ్ల లక్ష్మమ్మనర్సింహా, వార్డు సభ్యులు కన్నెబోయిన రాజలింగం, తాటిపాముల వినీత, ఆవనగంటి వెంకటమ్మ, నాయకులు సీనియర్ నాయకులు ఆవనగంటి స్వామి, కర్రే సంతోష్, చెన్ను స్వామి, బిక్షం తదితరులు పాల్గొన్నారు.

# శ్వాస పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరైన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 18:**



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుని కలిసి దివ్యాంగుల కోసం ఏర్పడిన దివ్యాంగుల హక్కుల చట్టం2016 అమలుపై చర్చిస్తున్న విశ్వవిద్యాలయాల దివ్యాంగుల రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్ అశోక్. హైదరాబాదులో ఫిలింనగర్ లో శ్వాస పుస్తక ఆవిష్కరణకు కార్యక్రమంలో కు హాజరై పుస్తక ఆవిష్కరణ చేసిన అనంతరం డాక్టర్ ఎన్. అశోక్ దివ్యాంగుల 2016 చట్టం కేంద్రం ఏర్పాటు చేసి పది సంవత్సరాలు పూర్తయిన అందులో ఒక్క అంశం కూడా అమలు కాలేదని కేంద్ర. రాష్ట్ర. ప్రభుత్వాలకు దివ్యాంగుల హక్కుల చట్టాలు అమలు చేయాలని మీ ప్రసంగాలలో అక్కడక్కడ దివ్యాంగుల కోసం సలహాలు సూచనలు ఇచ్చి సమాజంలో గౌరవంగా నిలువాలని ఉప రాష్ట్రపతికి విన్నపం చేయడం జరిగింది. అందుకు దివ్యాంగుల కోసం ఉద్యమం చేస్తున్న డాక్టర్ అశోక్ ను వెంకయ్య నాయుడు అభినందించారు. దివ్యాంగులు కూడా సమాన అవకాశాలు రావడానికి కృషి చేస్తాను, చెప్పడం సంతోషంగా ఉందని డాక్టర్ అశోక్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయాల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ మారలేని చంద్రశేఖర్ యాదవ్.విశ్వవిద్యాలయాల రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దొరపల్లి దానమ్మ, కూర్మ ఆంజనేయులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలి

- **మోత్కూర్ సి. ఐ. వెంకటేశ్వర్లు.**

**మోత్కూర్, జూలై 18, వెలుతురు న్యూస్ :**

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని, రహదారి భద్రతా నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మోత్కూర్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మోత్కూర్ మున్సిపాలిటీకి చెందిన కడమంచి రాజు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన హెల్మెట్ పంపిణీ కార్యక్రమానికి ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల సమయంలో తలకు తీవ్ర గాయాలు కాకుండా ప్రాణాలను రక్షించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు. రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు హెల్మెట్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించిన కడమంచి రాజును ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకన్న, హెడ్ కానిస్టేబుల్ నరసింహ, సుదగాని ఆంజనేయులు, ఎం సతీష్ కుమార్, చెరుకు దశరథ పోలీసు సిబ్బంది, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రధానమంత్రి జన్ ధన్ వ్యాపార ప్రకటనలు నమ్మొద్దు

- **తెలంగాణ వినియోగదారుల సంఘాల రాష్ట్ర కార్యదర్శి పోచం సోమయ్య.**

**మోత్కూర్, జులై 18,వెలుతురు న్యూస్ :**



ప్రధానమంత్రి జన్ ధన్ వ్యాపార రుణాల పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కోరుతూ వాట్సఅప్ యూట్యూబ్ ఫేస్బుక్లో ప్రకటనలు ఇవ్వడం వినియోగదారులను మోసం చేయడమేనని తెలంగాణ వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి పోచం సోమయ్య అన్నారు శనివారం పత్రిక ప్రకటన విడుదల చేస్తూ కేంద్ర ప్రభుత్వం నుండి నూతన వ్యాపార పథకం ఏర్పాటు చేశారని దానికోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కోరుతూ కొంతమంది మోసగాళ్ళు కొద్ది రోజులుగా అన్ని వాట్సఅప్ ఫేస్బుక్లో ప్రకటనలు ఇస్తూ. ఆన్లైన్ లో ప్రొసెసింగ్ ఫీజుల పేరుతో వేల రూపాయలు వసూలు చేయడం మోసంలో భాగమేనని అన్నారు వాస్తవానికి కేంద్ర ప్రభుత్వ పథకాలకు ఆన్లైన్లో ఎటువంటి ఫీజు చెల్లించే అవసరము లేదని తెలిపారు వినియోగదారులు ఫేస్బుక్లో అతి తక్కువ వడ్డీకి ఎక్కువ మొత్తములో రుణాలు గంటలోపట్లో ఇస్తామని నమ్మించి రుణానికి కావలసిన పత్రాలు బ్యాంకు పాసుబుక్ ఆధార్ కార్డ్ పాన్ కార్డ్ ఓటిపి నెంబర్ చెప్పిన తర్వాత బ్యాంకులో ఉన్న డబ్బులు పోతున్నాయని ఇప్పటికే పోలీస్ స్టేషన్లో సైబర్ క్రైమ్ క్రింద ఫిర్యాదులు చేశారని తెలిపారు ఎటువంటి సెక్యూరిటీ లేకుండా అతి తక్కువ వడ్డీకి ఆశపడి వినియోగదారులు ఆన్లైన్లోదరఖాస్తు చేసుకొని మోసపోవద్దని రుణాల కోసం బ్యాంక్ అధికారులను సంప్రదించాలని సమాచారం పొందాలని కోరారు.

# రిషిదేవ్ జన్మదిన వేడుకలు ఘనం

- **కిష్టాపురం గ్రామంలో ఆనందోత్సాహాల మధ్య నిర్వహణ**
- **శ్రీ ఆందోల్ మైసమ్మ ఆలయ ఆవరణలోని ఎస్ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో వేడుకలు**
- **గ్రామ పెద్దలు, యువకులు, బంధుమిత్రుల సమక్షంలో చిన్నారికి ఆశీర్వాదాలు**



**మునుగోడు వెలుతురు జూలై 18:**

కిష్టాపురం గ్రామానికి చెందిన మహేశ్వరం భాను ప్రసాద్–కావేరి దంపతుల ముద్దుల కుమారుడు రిషిదేవ్ జన్మదిన వేడుకలు శ్రీ ఆందోల్ మైసమ్మ ఆలయ ఆవరణలోని ఎస్ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు.కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థుల సమక్షంలో చిన్నారి రిషిదేవ్ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. చిన్నారి ఆయురారోగ్యాలతో, విద్యాభివృద్ధితో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పెద్దలు ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు.ఈ కార్యక్రమానికి మునుగోడు మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సూరి నరసింహ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై రిషిదేవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులను అభినందిస్తూ చిన్నారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.అలాగే గ్రామ పెద్దలు, యువకులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఆత్మీయ వాతావరణంలో జరిగిన ఈ వేడుకలో అతిథులు కుటుంబ సభ్యులతో కలిసి సందడి చేయగా, కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# కల్తీల నిరోధానికి కఠిన చట్టం...

**హైదరాబాద్ వెలుతురు జూలై 18:**



ఆహార, ఔషధాల కల్తీల నిరోధానికి కఠిన చట్టం రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు అన్ని కల్తీల బారిన పడుతుండడంతో ప్రతి ఒక్కరూ అనారోగ్యాల బారిన పడుతున్నారని సీఎం అన్నారు. తెలంగాణ ఆహార కల్తీ, ఔషధ నియంత్రణ చట్టం (TGFADCA)పై ఎంసీహెచ్ఆర్డీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు, పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని సీఎం తెలిపారు. ఎరువులు, పురుగు మందుల భారీ వాడకంతో పంట ఉత్పత్తుల్లోనూ రసాయన అవశేషాలు బయటపడి దిగుమతి చేసుకోవడానికి విదేశాలు నిరాకరిస్తున్న విషయాన్ని సీఎం ప్రస్తావించారు. మార్కెట్ లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో పలురకాల ఉత్పత్తులు అమ్ముతున్నారని, అధిక ధరలు ప్రజలు వాటిని కొంటున్నా... అవి సేంద్రియ ఉత్పత్తులే అని నిర్ధరించేందుకు సరైన వ్యవస్థలు లేవన్నారు. ఈ నేపథ్యంలో కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు ఉన్న దేశాలను సందర్శించి అక్కడి విధానాలను అధ్యయనం చేయాలని సీఎం అధికారులకు సూచించారు. ఆయా అధ్యయనాల ఆధారంగా ఒక సమగ్రమైన నివేదికను తయారు చేయాలన్నారు. దానిపై బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్రమైన చర్చ చేపడతామని సీఎం తెలిపారు. శాసనసభలో చర్చతో పాటు ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరించాలని సీఎం తెలిపారు. కల్తీలకు సంబంధించి సమగ్ర సమాచార సేకరణకు విజిల్ బ్లోయర్లను నియమించాలని, టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.కల్తీల నిరోధానికి సంబంధించి ముందుగా క్యూర్ ప్రాంతాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇక్కడ నిబంధనలు అమలు చేసి వాటి అమలులో వచ్చే లోటుపాట్ల ఆధారంగా ముందుకు సాగాలని సీఎం సూచించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సి.వి.ఆనంద్, సీఎం సలహాదారు, ఎక్స్ ఆఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు వి.శేషాద్రి, ఎన్.శ్రీధర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వర్షాలు కురవాలని జహీరాబాద్‌లో "సలాతుల్ ఇస్తిస్కా" ప్రత్యేక ప్రార్థనలు

- రైతుల పంటలు పండాలని, కరువు పరిస్థితులు తొలగాలని అల్లాహ్‌ను వేడుకున్న ముస్లింలు...



**జహీరాబాద్ వెలుతురు జూలై 18:**

రాష్ట్రంలో వర్షాలు ఆలస్యమవడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో వర్షాల కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జమీఅతుల్ ఉలమా జహీరాబాద్, ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఈద్గా మైదానంలో శనివారం సలాతుల్ ఇస్తిస్కా ప్రత్యేక నమాజ్‌ను పెద్ద ఎత్తున నిర్వహించారు.ఈ ప్రత్యేక ప్రార్థనల్లో వందలాది మంది ముస్లింలు పాల్గొని రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతుల పంటలు సమృద్ధిగా పండాలని, చెరువులు, కుంటలు, జలాశయాలు నిండాలని, ప్రజలు కరువు కష్టాల నుంచి బయటపడాలని అల్లాహ్‌ను వేడుకున్నారు. దేశంలో సుఖశాంతులు, ప్రజల ఆయురారోగ్యాలు, వ్యవసాయం అభివృద్ధి చెందాలని ప్రత్యేక దువాలు చేశారు.ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావం వంటి పరిస్థితుల సమయంలో ప్రతి ఒక్కరూ అల్లాహ్‌ను ఎక్కువగా స్మరించాలని, తమ తప్పిదాలకు తౌబా (పశ్చాత్తాపం) చేసి ప్రార్థనలు చేయాలని సూచించారు. అల్లాహ్ కరుణతో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరికీ మేలు జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ ప్రత్యేక సలాతుల్ ఇస్తిస్కా ప్రార్థనలు శనివారం, ఆదివారం కూడా ఇదే సమయంలో కొనసాగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమీఅతుల్ ఉలమా ప్రతినిధులు, ఈద్గా కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# రంజోల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత స్టేషనరీ పంపిణీ

- పేరెంట్స్–టీచర్స్ సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకుడు రమేష్ రెడ్డి....




**జహీరాబాద్ వెలుతురు జూలై 18:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామంలోని బాబా నగర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం నిర్వహించిన పేరెంట్స్–టీచర్స్ సమావేశంలో బీజేపీ జహీరాబాద్ టౌన్–2 అధ్యక్షుడు, యువ రైతు రమేష్ రెడ్డి బసంతపూర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేశారు.విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించిన రమేష్ రెడ్డి, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల సంక్షేమం కోసం నిరంతరం అండగా ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా బాధిత కుటుంబాలకు చేయూత

- ఎమ్మెల్యే మాణిక్ రావు చేతుల మీదుగా చెక్కుల పంపిణీ....




**జహీరాబాద్ వెలుతురు జూలై 18:**

అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు అన్నారు. కోహీర్ మండలానికి చెందిన వివిధ గ్రామాల ఆరుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.2,38,500 విలువైన చెక్కులను శనివారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు నర్సింలుతో కలిసి అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. లబ్ధిదారులు త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అవసరమైన ప్రతి సందర్భంలో సహాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మల్చెల్మ జడ్పీ ఉన్నత పాఠశాలకు కొత్త భవనం నిర్మించాలి

- టీచర్ల ఖాళీలు భర్తీ చేసి హాస్టల్ పునఃప్రారంభించాలి...
- మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై. నరోత్తం...

**జహీరాబాద్ వెలుతురు జూలై 18:**

జహీరాబాద్ మండలం మల్చెల్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెంటనే కొత్త భవనం నిర్మించి, ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయాలని మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై. నరోత్తం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉన్నత పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాల భవనంలో షిఫ్టుల పద్ధతిలో తరగతులు నిర్వహించడం దురదృష్టకరమన్నారు. ఉదయం ప్రాథమిక పాఠశాల, మధ్యాహ్నం ఉన్నత పాఠశాల నిర్వహించడం వల్ల విద్యార్థుల విద్యాభ్యాసానికి తీవ్ర అంతరాయం కలుగుతోందని చెప్పారు.ప్రాథమిక పాఠశాలలో 85 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ ఐదుగురు ఉపాధ్యాయులు ఉండాల్సిన చోట ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారని, దీంతో విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు వ్యవసాయ, కూలీ పనులకు వెళ్లిపోతుండటంతో చిన్నారులు మధ్యాహ్నానికే ఇంటికి చేరి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.పాఠశాల సమీపంలోని ప్రభుత్వ వసతి గృహం కేవలం 15 ఏళ్లకే శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని మూసివేశారని, దీంతో విద్యార్థుల సంఖ్య 250 నుంచి 132కు పడిపోయిందన్నారు. నాసిరకం నిర్మాణానికి బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోకుండా హాస్టల్‌ను మూసివేయడం విచారకరమని విమర్శించారు.ప్రభుత్వం వెంటనే కొత్త పాఠశాల భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, టీచర్ల ఖాళీలను భర్తీ చేయాలని, హాస్టల్‌ను పునఃప్రారంభించి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని వై. నరోత్తం డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మొహినొద్దీన్, ఎస్. గోపాల్, ఆనంద్, ఎం.డి. సాదిక్, ఎం. మల్లేశం, మాణిక్ రెడ్డి, ఘోరెప్ప, నసీర్, లాల్ మొహమ్మద్, పవన్ రాథోడ్, మేఘనాథ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.






# అట్టహాసంగా ప్రారంభమైన 4వ ఆల్ ఇండియా ఓపెన్ జూనియర్ చదరంగం పోటీలు

- పోటీలను ప్రారంభించిన నగర మేయర్ కోలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు

**కరీంనగర్ వెలుతురు జూలై 18:**

జీనియస్ చెస్ అకాడమీ , తెలంగాణ డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ కరీంనగర్ డిస్ట్రిక్ట్ డెమొక్రటిక్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రోజున కరీంనగర్ లోని వి కన్వెన్షన్ లో 4వ ఆల్ ఇండియా ఓపెన్ , జూనియర్ చదరంగం పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజులు జరిగే పోటీలను నగర మేయర్ కోలగాని శ్రీనివాస్ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లలకు చదరంగం ఆటతో మెదశక్తి తో పాటు ఏకాగ్రత క్రమశిక్షణ అలవాటు పడతారని, తల్లిదండ్రులు పిల్లలు చిన్ననాటి నుండే చదరంగం ఆటపై మక్కువ చూపే విధంగా ప్రోత్సహించాలన్నారు. డిప్యూటీ మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ ఎంతోమంది చదరంగం క్రీడాకారులను తయారు చేస్తున్న జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య, సీనియర్ కోచ్ అనూప్ కుమార్ ను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. టోర్నీ ఆర్గనైజర్ కంకటి అనూప్ కుమార్ మాట్లాడుతూ మాకు సహకరించిన బిర్లా ఓపెన్ మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్ మరియు వెంకట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంప వెంకట్ కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.రెండు రోజులపాటు జరిగే ఈ పోటీలకు వివిధ ప్రదేశాల నుంచి 600 మంది పైగా క్రీడాకారులు పాల్గొన్నారు అని నిర్వాకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒలంపిక్ స్టేట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జనార్దన్ రెడ్డి, డివైఎస్ఓ శ్రీనివాస్ గౌడ్ , కార్పొరేటర్ కే ఏ పి పి చంద్ర (టింకు)జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య సీనియర్ కోచ్ టోర్నీ ఆర్గనైజర్ కంకటి అనుప్ కుమార్ చీఫ్ కరీంనగర్ డెమొక్రటిక్ చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కంకటి సృజన్ కుమార్ ,తాటిపల్లి సతీష్ బాబు ఆర్బిటర్ బొల్లం సంపత్ కుమార్ ఆర్బిటర్ అనిల్ చదరంగం క్రీడాకారులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.





# SIR కార్యక్రమంలో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

- క్యాంపు కార్యాలయంలో BLOల సమక్షంలో SIR ఫారంలో వివరాల నమోదు

**కరీంనగర్ వెలుతురు జూలై 18:**

ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు శనివారం తన క్యాంపు కార్యాలయంలో 67వ బూత్‌కు చెందిన బూత్ లెవల్ ఆఫీసర్ (BLO) సమక్షంలో SIR ఫారంలో తన వ్యక్తిగత వివరాలను నమోదు చేసుకున్నారు.అనంతరం నమోదైన వివరాలను డిజిటల్ విధానంలో ధ్రువీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం చేపట్టిన SIR కార్యక్రమాన్ని ప్రతి అర్హత ఓటరు సద్వినియోగం చేసుకోవాలని, తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకొని ఓటరు జాబితాను తప్పులులేని విధంగా రూపొందించేందుకు సహకరించాలని కోరారు.ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు సక్రమంగా ఉండేలా ప్రజలు తమ వివరాలను పరిశీలించి అవసరమైతే సవరణలు చేయించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, అందరూ ఎన్నికల సంఘానికి సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో 67వ బూత్ BLOతో పాటు GPO పరశురాములు, సంబంధిత ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



# 10వ డివిజన్‌లో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు జూలై 18:**

నగరంలోని 10వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ సౌగాని కొమరయ్య ఆధ్వర్యంలో అపోలో హాస్పిటల్ వారి సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు మాట్లాడుతూ, ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఇటువంటి ఉచిత ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో ఇటువంటి ఆరోగ్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.అనంతరం నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు గారు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ సౌగాని కొమరయ్య, అపోలో హాస్పిటల్ వైద్యులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.





# బయో-మెడికల్ వ్యర్థాల నిర్వహణలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలి

**హైదరాబాద్ వెలుతురు జూలై 18:**

బయో–మెడికల్ వ్యర్థాల నిర్వహణలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్య రక్షణకు, పర్యావరణ పరిరక్షణకు బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ కీలకమైన అంశమని మంత్రి సురేఖ పేర్కొన్నారు. శనివారం రోజున బంజారాహిల్స్ లోని మినిస్టర్స్ క్యాంపు ఆఫీస్ లో రాష్ట్రంలో బయో మెడికల్ మేనేజ్మెంట్ రూల్స్– 2016 అమలు, యూజర్ ఛార్జిల పెంపు, బయో మెడికల్ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, పర్యావరణ సంరక్షణ, ప్రజారోగ్య పరిరక్షణకు సంబంధించిన అంశాలపై మంత్రి సురేఖ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అటవీ, పర్యావరణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ జి. రవి, చీఫ్ ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ బి. రఘు, జాయింట్ ఛీఫ్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ డి. కృపానంద్, సీనియర్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ సుజన, వైద్యారోగ్యశాఖ అధికారులు, Environment Protection Training and Research Institute (EPTRI) అధికారులు, తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్(THANA) ప్రతినిధులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్(IMA) ప్రతినిధులు,Common Bio–Medical Waste Treat–ment facilities ప్రతినిధులు, పలువురు పిసిబి అధికారులు తదితరులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బయో మెడికల్ వేస్ట్ నిర్వహణ పై పిసిబి అధికారులు మంత్రికి వివరించారు. 2024 వార్షిక నివేదిక ప్రకారం ప్రతి రోజు రాష్ట్రవ్యాప్తంగా వున్న 11,457 ఆరోగ్య సంరక్షణ కేంద్రాల ద్వారా రోజుకి 31.27 టన్నులు జీవవైద్య వ్యర్థాలు (బయో మెడికల్ వేస్ట్) ఉత్పత్తి అవుతున్నట్లు అధికారులు మంత్రి సురేఖ గారికి తెలిపారు. వీటిలో 6000 బెడ్లు కలిగిన హాస్పటిల్ కాగా, మిగతావి బ్లడ్ బ్యాంకులు, లేబొరేటరీలు, ఓపి హాస్పిటల్ గా వారు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 13 Common Bio–Medical Waste Treat–ment facilities లకు అనుమతులుండగా, వీటిలో 11 కేంద్రాలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని అధికారులు స్పష్టం చేశారు.

కొత్త CBMWTF ల ఏర్పాటు, వాటి సంఖ్యను పెంచే దిశగా జరుగుతున్న చర్యల పై మంత్రి సురేఖ అధికారులను ఆరా తీశారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి 2025లో కొత్త CBMWTF ల ఏర్పాటు పై 'గ్యాప్ అనాలసిస్ స్టడీ' చేయాలని జారీ చేసిన ఆదేశాల పై మంత్రి సురేఖ అధికారులను ప్రశ్నించారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన ప్రతిపాదన ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణ శిక్షణ మరియు పరిశోధన సంస్థ (EPTRI) పరిశీలనలో వున్న విషయాన్ని వారు మంత్రికి తెలిపారు. వారి నుంచి నివేదిక రాగానే కొత్త CBMWTF ల ఏర్పాటు పై తుది నిర్ణయానికి రానున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు బయో–మెడికల్ వ్యర్థాల నిర్వహణకు చెల్లిస్తున్న యూజర్ ఛార్జీలలో ఏకరీతి తీసుకురావాల్సిన అవసరంపై సమావేశం విస్తృతంగా చర్చ జరిగింది. బయో మెడికల్ మేనేజ్మెంట్ రూల్స్ నేపథ్యాన్ని పిసిబి అధికారులు మంత్రి కొండా సురేఖ గారికి వివరించారు. మార్గదర్శకాలకు సంబంధించిన పలు అంశాల పై మంత్రి సురేఖ అధికారులను ఆరా తీశారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి 2016 లో ఏకరీతి ఛార్జీలు వుండాలని ఆదేశించిన విషయాన్ని అధికారులు మంత్రికి వివరించారు. అప్పటి నుంచే ఈ అంశం ప్రభుత్వం దగ్గరే పెండింగ్ లో వున్నదని తెలిపారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (IMA), తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్(THANA), Common Bio–Medical Waste Treatment facilities (CBMWTF) ల వివరణలను మంత్రి సురేఖ విన్నారు. IMA, THANA బయో మెడికల్ వేస్ట్ బరువు ప్రకారం ఛార్జీలు వుండాలని కోరగా, CBMWTF ప్రతినిధులు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల ప్రకారం బెడ్ ల ప్రకారమే ఛార్జీలు చెల్లించాలని కోరారు. ఇరు పక్షాల వివరణలు, సమస్యలు విన్న మంత్రి కొండా సురేఖ గారు ఇరు పక్షాలు తమ తమ ప్రతిపాదనలను సమర్పించాలని, వీలైనంత త్వరలో మరో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి పరిష్కారాలను కనుగొంటామని వారికి స్పష్టం చేశారు. అదే విధంగా ఆరోగ్య సంరక్షణ సంస్థల సిబ్బందికి జీవవైద్య వ్యర్థాల నిర్వహణపై నిరంతర శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం జీవవైద్య వ్యర్థాలను 48 గంటల్లోపు సేకరించి, శుద్ధి చేసి, తదనంతర ప్రక్రియలను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యర్థాల నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తూ, ప్రజారోగ్యానికి ఎటువంటి ముప్పు వాటిల్లకుండా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**వరంగల్ లో పర్యావరణ సంరక్షణ కార్యక్రమాలను చేపట్టాలి**

వరంగల్ జిల్లాలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను చేపట్టాలని మంత్రి సురేఖ పిసిబి అధికారులక సూచించారు. ప్లాస్టిక్ బాటిల్స్ సేకరణ కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని ఆదేశించారు. త్వరలో ఈ దిశగా కాలుష్య నియంత్రణ మండలితో మీటింగ్ నిర్వహిద్దామని స్పష్టం చేశారు. అదే విధంగా జిడబ్ల్యుఎంసి పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను పూర్తిగా నిర్మూలించేకు గాను వరంగల్ మున్సిపల్ కమిషనర్ తో చర్చించి, కార్యాచరణ ప్రణాళికను రూపొందించే దిశగా ఆలోచిస్తున్నామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

# వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యల నివారణకు క్షేత్రస్థాయిలో పరిశీలించిన సైబరాబాద్ సీపీ

**సైబరాబాద్ వెలుతురు జూలై 18:**

వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉండేలా చర్యలు చేపట్టేందుకు సైబరాబాద్ సీపీ డా ఎం. రమేష్ జాయింట్ సీపీ (ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్ శేరిలింగంపల్లి మరియు కూకట్‌పల్లి జోన్ల జోనల్ కమిషనర్లు, ఇరు జోన్లకు చెందిన సంబంధిత ఇంజినీర్లు, డీసీపీ ట్రాఫిక్, ఏడీసీపీ ట్రాఫిక్ తో పాటు ఇతర సంబంధిత అధికారులు కలిసి ఎలక్షన్ బిల్డింగ్ మరియు పిస్తా హౌస్ పరిసర ప్రాంతాల్లో నీరు నిలిచే (Waterlogging) ప్రాంతాలను శనివారం క్షేత్రస్థాయిలో సందర్శించి సమగ్రంగా పరిశీలించారు.ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఆయా ప్రాంతాల్లో నీరు నిల్వ కావడానికి గల కారణాలను అధికారులు పరిశీలించారు. వర్షపు నీరు వేగంగా వెళ్లేలా డ్రైనేజ్ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచడం, బాటిల్‌నెక్ పాయింట్లను తొలగించడం, కల్వర్టులు మరియు స్టార్మ్ వాటర్ డ్రైన్లను విస్తరించడం, సిల్ట్ మరియు చెత్తను పూర్తిగా తొలగించడం, అవసరమైన చోట్ల అదనపు డ్రైనేజ్ లైన్లను ఏర్పాటు చేయడం వంటి తక్షణ మరియు దీర్ఘకాలిక చర్యలపై సంబంధిత అధికారులతో విస్తృతంగా చర్చించారు.



ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ వర్షాకాలంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. నీరు నిలిచే ప్రాంతాల్లో అత్యవసర స్పందన బృందాలు, మోటార్ పంపులు, అవసరమైన యంత్రాలు మరియు సిబ్బందిని ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని సూచించారు.అదేవిధంగా జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్, ఇరిగేషన్ మరియు ఇతర సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి నీటి నిల్వ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వర్షపు రోజులలో ట్రాఫిక్ సాఫీగా కొనసాగేలా అవసరమైన అన్ని చర్యలను వేగవంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ప్రజల భద్రత, సౌకర్యం మరియు నిరంతర ట్రాఫిక్ నిర్వహణకు సైబరాబాద్ పోలీసులు అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేస్తూ వర్షాకాల సవాళ్లను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు కట్టుబడి ఉన్నామని అధికారులు తెలిపారు.


# ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల బృందం

**హైదరాబాద్, జూలై 18(వెలుతురు):**



గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రాథమిక చికిత్స అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీల రక్షణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ అసోసియేషన్ ప్రతినిధుల బృందం శనివారం తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం సమర్పించింది. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పబ్బా చంద్రశేఖర్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. మారుమూల పల్లెలు, బస్తీలలో రాత్రింబవళ్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ, సేవాభావంతో ప్రథమ చికిత్స అందిస్తున్న వైద్యుల కష్టాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల తమ సమస్యలు చాలా కాలంగా పరిష్కారానికి నోచుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఫీల్డ్ స్థాయిలో అధికారుల వేధింపులతో పాటు, వైద్యులపై భౌతిక దాడులు పెరిగిపోతున్నాయని, వీటికి అడ్డుకట్ట వేసి తగిన భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పెండెం నాగభూషణం, ప్రతినిధులు వంజరి విష్ణు, కృష్ణమూర్తి, హేమశ్రీనివాస నాయక్, శ్రీనివాస్, నారాయణ దాస్, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యాక్సిన్ భద్రత సమాచార నిర్వహణ వ్యవస్థ పోర్టల్ పై వైద్యాధికారులకు శిక్షణ





**హైదరాబాద్ వెలుతురు జూలై 18:**

వ్యాక్సిన్ ద్వారా నివారించగల వ్యాధుల నిఘా (Vaccine Preventable Disease Surveillance – VPDS) మరియు వ్యాక్సిన్ భద్రత సమాచార నిర్వహణ వ్యవస్థ (vaccine safety information Management system) పోర్టల్ పై వైద్యాధికారులకు, డాటా ఎంట్రీ ఆపరేటర్స్ కు శిక్షణ కార్యక్రమం జిల్లా వైద్య మరియు మరియు ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. VSIMS ద్వారా టీకా భద్రతను సమర్థవంతంగా పర్యవేక్షించడం వల్ల టీకా కార్యక్రమాల నాణ్యత మెరుగుపడి ప్రజలో విశ్వాసం పెరిగి , ప్రజారోగ్య రక్షణ మరింత బలోపేతం అవుతుంది.

డా:పుట్ల శ్రీనివాస్

DMHO, హైదరాబాద్

ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ

వ్యాక్సిన్ ద్వారా నివారించగల వ్యాధుల నిఘా (VPDS) అనేది టీకాల ద్వారా నివారించగల అంటువ్యాధులను నిరంతరం గుర్తించడం, నివేదించడం, దర్యాప్తు చేయడం, ప్రయోగశాల ద్వారా నిర్ధారించడం మరియు నియంత్రణ చర్యలు చేపట్టే వ్యవస్థ అని తెలియజేశారు.

ముఖ్య ఉద్దేశ్యాలు:

టీకాల ద్వారా నివారించగల వ్యాధులను ముందస్తుగా గుర్తించడం.

వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు తక్షణ చర్యలు తీసుకోవడం.

టీకాల ప్రభావాన్ని అంచనా వేయడం.

టీకా కార్యక్రమంలో లోపాలను గుర్తించి సరిదిద్దడం.

వ్యాధి నిర్మూలన మరియు నియంత్రణ లక్ష్యాలను సాధించడం.

నిఘాలో ప్రధానంగా పర్యవేక్షించే వ్యాధులు:

మీజిల్స్ (Measles)

పోలియో (Acute Flaccid Paralysis – AFP)

డిఫ్తీరియా (Diphtheria)

టెటనస్ (Tetanus)

పెర్టుసిస్ / కోరింత దగ్గు (Pertussis)

నిఘా ప్రక్రియ:

1. అనుమానిత కేసులను గుర్తించడం.
2. వెంటనే ఆరోగ్య అధికారులకు సమాచారం ఇవ్వడం.
3. కేసు దర్యాప్తు నిర్వహించడం.
4. అవసరమైన నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించడం.
5. ప్రయోగశాల ఫలితాల ఆధారంగా నిర్ధారణ చేయడం.
6. వ్యాధి నియంత్రణ చర్యలు చేపట్టడం (టీకా కార్యక్రమాలు, కాంటాక్ట్ ట్రేసింగ్, ఆరోగ్య విద్య).
7. కేసులను నిరంతరం పర్యవేక్షించి నివేదికలు సమర్పించడం.

రాష్ట్రంలో 8 జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టు క్రింద VSIMS పోర్టల్ ప్రవేశపెట్టడం జరిగింది. అందులో మన హైదరాబాద్ జిల్లా ఒకటి. జిల్లా లోని అన్ని ప్రభుత్వ హెల్త్ ఫెసిటీలలో ఈ పైలెట్ ప్రాజెక్టు కింద 6 నెలలు ఈ కార్యక్రమం కొనసాగుతుంది.

ఇంకా ఈ కార్యక్రమంలో డా. శ్రీధర్ జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి, డా. సాయిబాబా ప్రోగ్రాం ఆఫీసర్, డా.మురారి surveillance Medical officer, డా. మనోజ్ రెడ్డి, వైద్యాధికారులు, డాటా ఎంట్రీ ఆపరేటర్స్ పాల్గొన్నారు.

# రన్ ఫర్ ఎస్ఎంఏ ఆగస్టు 9న





- 4వ ఎడిషన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ యం.రమేష్
- గచ్చిబౌలి స్టేడియం వేదికగా నిర్వహిస్తున్న క్యూర్ ఎస్ఎంఏ ఇండియా

**హైదరాబాద్, వెలుతురు జూలై 2026:**

దేశవ్యాప్తంగా SMA (స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ) ప్రభావిత కుటుంబాలకు మద్దతు నిస్తూ, తల్లిదండ్రుల ఆధ్వర్యంలో నడుస్తున్న సేవా సంస్థ, క్యూర్ ఎస్ఎంఏ ఇండియా , 'రన్ ఫర్ ఎస్ఎంఏ – 2026' 4వ ఎడిషన్ ఆగస్టు 9వ తేదీన హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించనుంది.ఈ నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ యం.రమేష్ IPS , SMA అవగాహన కల్పనలో భాగంగా ఈ కార్యక్రమానికి మద్దతునిస్తూ, ఆయన ఈ సందర్భంగా రన్ ఫర్ SMA 2026 పోస్టర్‌ను శనివారం నాడు గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమీషనర్ కార్యాలయంలో ఆవిష్కరించారు.రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లోని సీనియర్ జెనెటిసిస్ట్ డాక్టర్ రాధా రమా దేవి, నిమ్స్ న్యూరాలజీ HOD డాక్టర్. సూర్యప్రభ, సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ CEO నవేద్ ఆలం ఖాన్ , SMS సహ వ్యవస్థాపకులు శ్రీలక్ష్మి , అర్చన పాండా, మైక్రోసాఫ్ట్ నుండి విజయ్ వావిలాల తో సహా ప్రముఖ వైద్య, పరిశోధన నిపుణులు ఆవిష్కరణలో ఉన్నారు.Cure SMA ఇండియా సహ వ్యవస్థాపకురాలు, ట్రస్టీ శ్రీలక్ష్మి నలం మాట్లాడుతూ 'రన్ ఫర్ SMA – 2026' ప్రపంచవ్యాప్తంగా SMA అవగాహన ఆగస్టు మాసంగా (Global SMA Awareness Month) లో భాగంగా జరుగుతుందన్నారు. గచ్చిబౌలిలో జరుహగుతున్న ఈ రన్ 21కె, 10కె, 5కె టైమ్డ్, అలాగే 5కె నాన్ టైమ్డ్ వర్గాల్లో పోటీలు ఉంటాయన్నారు. రన్ లో పాల్గొనే ప్రతి ఒక్కరికి టీషర్ట్, మెడల్, సర్టిఫికేట్ ఇవ్వనున్నట్లు తెలిపారు.విద్యార్థులు, కార్పొరేట్ ఉద్యోగులు, వైద్య నిపుణులు, SMA బాధిత కుటుంబాలు, సాధారణ ప్రజలు పెద్ద ఎత్తున పాలుపంచుకుంటున్నారని, చెప్పారు. అరుదైన, జన్యుపరమైన వ్యాధి, Spinal Muscular Atrophy (SMA) పై ప్రజల్లో అవగాహన పెంచడం లక్ష్యంగా సంస్థ పని చేస్తుందని ఆమె వివరించారు.'రన్ ఫర్ SMA – 2026' లో పాలుపంచుకునేందుకు, నమోదు లింక్: Registrations are now open: https://ifinish.in/running/runforsma2026 (OR)

For more information call: 8885004858

# త్వరలో చలో ఇందిర పార్క్ లో భారీ భహిరంగ సభ

- మాదిగలకు రాజ్యాధికారమే లక్ష్యం
- మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు
- మాదిగ భవనానికి 10 ఎకరాల భూమి కేటాయించాలని డిమాండ్
- ప్రభుత్వం లాక్కున్న దళితుల భూములు తిరిగి ఇవ్వాలి
- దళిత బంధు పెండింగ్ లబ్ధిదారులకు అందించాలని విజ్ఞప్తి

**హైదరాబాద్, వెలుతురు జూలై 18 :**




మాదిగ సామాజిక వర్గాన్ని రాజ్యాధికారం దిశగా నడిపించడమే మాదిగ మహాశక్తి సంఘం ప్రధాన లక్ష్యమని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు స్పష్టం చేశారు. సందర్భంగా బేగంపేటలోని మహాశక్తి భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని సుమారు 70 లక్షల మంది మాదిగలు తమ ఓటును తమ సామాజిక వర్గ అభ్యున్నతికే వినియోగించాలని ఆయన పిలుపునిచ్చారు. మాదిగల్లో ఐక్యత లేకపోవడం వల్లే రాజకీయంగా వెనుకబడుతున్నారని, లోక్‌సభ, రాజ్యసభల్లో తగిన ప్రాతినిధ్యం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు మాత్రమే మాల, మాదిగ వర్గాలకు సమాన అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. మాదిగ మహాశక్తి సంఘం ద్వారా మాదిగ సమాజాన్ని రాజకీయంగా ఏకం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. మాదిగ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం 10 ఎకరాల భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాదిగలను అణచివేసే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దళితుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత చిత్తశుద్ధితో పనిచేయాలని కోరిన ఆయన, ప్రభుత్వం అక్రమంగా స్వాధీనం చేసుకున్న దళితుల భూములను తిరిగి అప్పగించాలని, గతంలో దళిత బంధు పథకం అందని అర్హులందరికీ వెంటనే మంజూరు చేయాలని కోరారు. హుజురాబాద్ ప్రాంతంలో వేలాది మంది దళితులు తమ సమస్యలతో రోడ్డున పడుతున్నారని పేర్కొన్న మోత్కుపల్లి, దళితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో దళితులపై ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించానని, చుండూరులో మాలలపై జరిగిన దాడిని ఖండిస్తూ చైతన్య రథం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పర్యటించిన విషయాన్ని గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా దళితుల హక్కులు, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతానని, అవసరమైతే జాతి కోసం ప్రాణాలు అర్పించడానికైనా సిద్ధంగా ఉన్నానని తెలిపారు.త్వరలో మాదిగ మహా శక్తి ఆధ్వర్యంలో ఇందిర పార్క్ మహా ధర్నా ను నిర్వహించడం జరుగుతుందని అన్నారు . ఈ కార్యక్రమం లో నేతలు మాస్టర్ జి , ప్రో కనకయ్య, ముంజగల విజయ్ ,వాసు, డా "సగరపు ప్రసాద్ ,వీరస్వామి, నారాయణ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అచ్చమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 3 లక్షల ఎల్వోసీ

- కంటి చికిత్స కోసం ఆర్థిక సాయం అందజేత
- ఎమ్మెల్యే దానం నాగేందర్ చేతుల మీదుగా లెటర్ ఆఫ్ క్రెడిట్ పంపిణీ
- మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ సమక్షంలో కార్యక్రమం
- కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని



**శుభాకాంక్షలు**

**హైదరాబాద్ వెలుతురు జూలై 18:**

హిమాయత్‌నగర్ డివిజన్‌లోని గాంధీ కుటీర్ నివాసి మంచాల అచ్చమ్మకు కంటి చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) నుంచి రూ.3 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్ (LOC) అందజేశారు.ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, హిమాయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ చేతుల మీదుగా ఈ లెటర్ ఆఫ్ క్రెడిట్‌ను అచ్చమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు అవసరమైన సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అండగా నిలుస్తున్నారని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి. రామన్ గౌడ్, జ్ఞానేశ్వర్, మహేష్, జాకీ తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అచ్చమ్మ త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

# ఆయిల్‌పామ్ రైతుల కోసం దక్షిణాది ఏకమవ్వాలి

- దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పునరుద్ధరించాలని కేంద్రానికి డిమాండ్

**హైదరాబాద్ వెలుతురు జూలై 18:**

ఆయిల్‌పామ్ రైతుల ప్రయోజనాల పరిరక్షణ కోసం దక్షిణాది రాష్ట్రాలు ఏకతాటిపైకి రావాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వంపై సంయుక్తంగా ఒత్తిడి తీసుకురావాలనే ఉద్దేశంతో దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులకు ఆయన లేఖ రాశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి ఆయిల్‌పామ్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించాలని ప్రతిపాదించారు.ఆయిల్‌పామ్ పంటకు కనీస హామీ ధరను టన్నుకు రూ.25 వేలుగా నిర్ణయించాలని తుమ్మల డిమాండ్ చేశారు. ఒకవేళ అది సాధ్యం కాకపోతే ముడి పామ్ నూనెపై దిగుమతి సుంకాన్ని మళ్లీ 44 శాతానికి పెంచాలని కేంద్రాన్ని కోరారు.దిగుమతి సుంకాలను తగ్గించడం వల్ల దేశీయ ఆయిల్‌పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మంత్రి పేర్కొన్నారు. ధరలు పడిపోవడంతో రైతులకు గిట్టుబాటు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.దేశంలో సాగవుతున్న ఆయిల్‌పామ్ పంటలో సుమారు 75 శాతం వాటా దక్షిణాది రాష్ట్రాలదేనని తుమ్మల గుర్తు చేశారు. రైతులకు స్థిరమైన ఆదాయం అందాలంటే కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని తగిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

వంటనూనెల ఉత్పత్తిలో దేశాన్ని స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్లాలంటే ముందుగా ఆయిల్‌పామ్ రైతులను రక్షించాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధన కోసం దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసి పనిచేసి రైతుల ప్రయోజనాల కోసం ఉమ్మడి కార్యాచరణ చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

# నేటి నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేపడతా: అభిజీత్ దీప్కే

- **నేటి నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేపడతా: అభిజీత్ దీప్కే**
- **జులై 20న 'చలో సంసద్' పాదయాత్ర యథావిధిగా నిర్వహిస్తామని ప్రకటన**
- **సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి వద్ద భారీ భద్రత.. డీహైడ్రేషన్‌తో చికిత్స పొందుతున్న వాంగ్‌చుక్**
- **వైద్య వివరాలు ఇవ్వడం లేదని ఆసుపత్రి సిబ్బందిపై భార్య ఆగ్రహం**



పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను బలవంతంగా ఆసుపత్రికి తరలించినప్పటికీ తమ ఉద్యమం ఏమాత్రం ఆగదని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్షకు కొనసాగింపుగా తానే నేటి నుంచి నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, మద్దతుదారులంతా ఐక్యంగా పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా అభిజీత్ దీప్కే మాట్లాడుతూ.. ''ఈ రోజు నుంచి నేను నిరవధిక నిరాహార దీక్ష చేపడుతున్నాను. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయవద్దు. దేశం నలుమూలల నుంచి మద్దతుదారులు జంతర్‌మంతర్‌కు చేరుకోవాలి. జులై 20న నిర్వహించనున్న 'చలో సంసద్' పాదయాత్రను యథావిధిగా కొనసాగిస్తాం'' అని తెలిపారు.కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో కొన్ని వారాల క్రితం కాక్రోచ్ జనతా పార్టీ ఢిల్లీలో ఆందోళనలు ప్రారంభించింది. ఈ నిరసనల్లో భాగంగానే సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. జులై 20న పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అదే రోజు పార్లమెంట్ వరకు శాంతియుతంగా 'చలో సంసద్' పాదయాత్ర నిర్వహిస్తామని పార్టీ ఇప్పటికే ప్రకటించింది. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చింది.ఇదిలా ఉండగా, నిరాహార దీక్ష కారణంగా సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణించడంతో అధికారులు ఆయనను ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వద్ద భారీ ఎత్తున భద్రతను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి వైద్యులు ప్రకటన విడుదల చేశారు. దీర్ఘకాల నిరాహార దీక్ష వల్ల ఆయన తీవ్ర బలహీనతకు గురయ్యారని, శరీరంలో నీటి శాతం తగ్గి డీహైడ్రేషన్ లక్షణాలు కనిపిస్తున్నాయని తెలిపారు. ఆయనకు నిరంతర వైద్య పర్యవేక్షణతో పాటు అవసరమైన చికిత్స అందిస్తున్నామని వెల్లడించారు.మరోవైపు, ఆసుపత్రి సిబ్బంది వ్యవహారంపై వాంగ్‌చుక్ భార్య తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలోకి మొబైల్ ఫోన్ తీసుకెళ్లేందుకు అనుమతించలేదని, వాంగ్‌చుక్‌కు నిర్వహించిన వైద్య పరీక్షల వివరాల ప్రతులను కూడా అందించడం లేదని ఆరోపించారు. ఇందుకు గల కారణాలను వెల్లడించాలని ఆసుపత్రి అధికారులను ఆమె ప్రశ్నించారు.వాంగ్‌చుక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పటికీ ఉద్యమం ఆగదని, ముందుగా ప్రకటించిన అన్ని కార్యక్రమాలను యథావిధిగా నిర్వహిస్తామని కాక్రోచ్ జనతా పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. జులై 20న జరగనున్న 'చలో సంసద్' కార్యక్రమంపై దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# సోనమ్ వాంగ్ చుక్ దీక్ష భగ్నం

- **21 రోజుల దీక్ష తర్వాత ఆసుపత్రికి సామాజిక కార్యకర్త**
- **హైకోర్టు ఆదేశాలతో సఫ్దర్‌జంగ్‌కు తరలింపు..**
- **జంతర్‌మంతర్ వద్ద స్వల్ప ఉద్రిక్తత**
- **ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో కొనసాగుతున్న నిరాహార దీక్ష**
- **ఆరోగ్యం క్షీణించడంతో బలవంతంగా ఆసుపత్రికి తరలించిన పోలీసులు**
- **నిరసనకారుల అడ్డుకోవడంతో ఉద్రిక్తత.. శాంతి పాటించాలని పోలీసుల విజ్ఞప్తి**
- **తన అనుమతి లేకుండా చికిత్స చేయొద్దని వాంగ్‌చుక్ భార్య గీతాంజలి డిమాండ్**

**న్యూఢిల్లీ, వెలుతురు జూలై 18:**



ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 21 రోజులుగా నిరాహార దీక్ష కొనసాగిస్తున్న పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను శనివారం పోలీసులు సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో తక్షణ వైద్య సహాయం అందించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టారు. నిరసన ప్రాంతం నుంచి వాంగ్‌చుక్‌ను తరలించే సమయంలో నిరసనకారులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది.ప్రవేశ పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వాంగ్‌చుక్ గత నెలాఖరులో నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. 21 రోజులుగా ఆహారం తీసుకోకుండా ఆందోళన కొనసాగించడంతో ఆయన ఆరోగ్యం క్రమంగా క్షీణించింది. వైద్యుల సూచన మేరకు వెంటనే ఆసుపత్రికి తరలించాల్సిన అవసరం ఏర్పడిందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించే సమయంలో జంతర్‌మంతర్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిరసనకారులు పోలీసుల చర్యలను వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగగా, పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఢిల్లీ పోలీసులు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందిస్తూ.. హైకోర్టు ఆదేశాల మేరకే వాంగ్‌చుక్‌ను వైద్య చికిత్స కోసం తరలించినట్లు తెలిపారు. నిరసనకారులు శాంతియుతంగా వ్యవహరించాలని, వీలైనంత త్వరగా జంతర్‌మంతర్ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని విజ్ఞప్తి చేశారు.ఇదిలా ఉండగా, వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జె ఆంగ్మో ఆసుపత్రి అధికారుల తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తన అనుమతి లేకుండా భర్తకు ఎలాంటి వైద్య చికిత్స ప్రారంభించవద్దని స్పష్టం చేశారు. ''ఆయన ప్రస్తుతం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఉన్నారు. నా అనుమతి లేకుండా చికిత్స అందించకూడదు. ఆయనకు ఏదైనా జరిగితే అందుకు బాధ్యులెవరో వారినే జవాబుదారీగా నిలబెడతాం. నిన్న వరకు ఆయన ఆరోగ్యం బాగానే కనిపించింది. ఆసుపత్రికి తరలించాల్సిన అవసరం లేదు. మా కుటుంబ వైద్యుడి అనుమతి లేకుండా ఎలాంటి చికిత్స చేయడానికి వీల్లేదు. అది మా హక్కు'' అని ఆమె మీడియాతో పేర్కొన్నారు.మరోవైపు, వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించినప్పటికీ తమ ఉద్యమం కొనసాగుతుందని ఆయన మద్దతుదారులు స్పష్టం చేస్తున్నారు. ముందుగా ప్రకటించిన నిరసన కార్యక్రమాలను యథావిధిగా నిర్వహిస్తామని వారు వెల్లడించారు.

# అంతరిక్షంలోకి దూసుకెళ్లిన 'విక్రమ్1'

- **భారత ప్రైవేట్ స్పేస్ రంగంలో కొత్త అధ్యాయం**
- **శ్రీహరికోట నుంచి స్కైరూట్ తొలి ఆర్బిటల్ రాకెట్ విజయవంతమైన ప్రయోగం**
- **35 నిమిషాల ఆలస్యానంతరం నింగిలోకి.. నిర్ణీత కక్ష్యలోకి చేరిన ఉపగ్రహాలు**

**శ్రీహరికోట, వెలుతురు జూలై 18:**



భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యానికి చారిత్రక మైలురాయి నెలకొంది. ప్రముఖ స్పేస్‌టెక్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన తొలి ఆర్బిటల్ క్లాస్ రాకెట్ 'విక్రమ్-1' శనివారం విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం (షార్) తొలి ప్రయోగ వేదిక నుంచి మధ్యాహ్నం 12.05 గంటలకు ఈ ప్రయోగాన్ని చేపట్టగా, రాకెట్ విజయవంతంగా ప్రయాణించి తన పేలోడ్లను నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టింది.వాస్తవానికి ఈ ప్రయోగాన్ని ఉదయం 11.30 గంటలకు నిర్వహించాల్సి ఉండగా, కౌంట్‌డౌన్ చివరి దశలో సాంకేతిక లోపం గుర్తించారు. ఇంధన నింపే ప్రక్రియలో సమస్య తలెత్తడంతో ప్రయోగాన్ని తాత్కాలికంగా నిలిపివేసి శాస్త్రవేత్తలు అత్యవసర పరిశీలనలు చేపట్టారు. లోపాన్ని సరిచేసిన అనంతరం 35 నిమిషాల ఆలస్యంగా రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించారు. దాదాపు 20 నిమిషాల ప్రయాణం అనంతరం విక్రమ్-1 తన పేలోడ్లను నిర్ణీత లో ఎర్త్ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టింది. ప్రయోగం విజయవంతం కావడంతో "హలో స్పేస్... విక్రమ్-1 వచ్చేసింది" అంటూ స్కైరూట్ సంస్థ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆనందాన్ని పంచుకుంది.

### అంతరిక్షంలోకి 'వందేమాతరం'

ఈ ప్రయోగంలో సాంకేతిక పేలోడ్లతో పాటు ప్రత్యేకంగా రూపొందించిన భావోద్వేగ చిహ్నాలను కూడా రోదసిలోకి పంపించారు. ప్రధాని నరేంద్ర మోదీ స్వహస్తాలతో రాసిన 'వందేమాతరం' సందేశంతో కూడిన ప్రత్యేక పోస్టుకార్డును రాకెట్‌లో భద్రపరిచారు. అలాగే కాస్మోస్ డైమండ్స్ సంస్థ రూపొందించిన 'కాస్మిక్ బ్లూమ్' ఆర్ట్‌వర్క్, విక్రమ్-1 రాకెట్ సూక్ష్మ ప్రతిరూపాన్ని కూడా అంతరిక్షంలోకి పంపించారు. ఆ ప్రతిరూపంపై భారత అంతరిక్ష, విజ్ఞాన రంగానికి సేవలందించిన సర్ సీవీ రామన్, డాక్టర్ విక్రమ్ సారాభాయ్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సూక్ష్మ చిత్రాలను చెక్కారు.

అంతేకాకుండా, ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ స్కైరూట్ బృంద సభ్యులు, ఇస్రో మాజీ ఛైర్మన్లు, శాస్త్రవేత్తలు, భారతీయ వ్యోమగాములు తదితరులు స్వహస్తాలతో రాసిన డజన్ల కొద్దీ పోస్టుకార్డులను ప్రత్యేక పేలోడ్ బాక్స్‌లో భద్రపరచి రోదసిలోకి పంపడం విశేషంగా నిలిచింది.

### 'మిషన్ ఆగమన్'కు శ్రీకారం

ఈ చారిత్రక ప్రయోగానికి స్కైరూట్ 'మిషన్ ఆగమన్' అనే పేరు పెట్టింది. భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం ఆర్బిటల్ ప్రయోగాల యుగంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ పేరును ఎంపిక చేసినట్లు సంస్థ తెలిపింది. విక్రమ్-1 ద్వారా గ్రహాస్పేస్, కాస్మోసెర్వ్, డీక్యూబ్డ్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ పేలోడ్లతో పాటు స్కైరూట్ అభివృద్ధి చేసిన 'స్కోప్' పేలోడ్‌ను కూడా రోదసిలోకి పంపించారు. ఈ ప్రయోగం ద్వారా రాకెట్‌లోని ప్రొపల్షన్, స్టేజ్ సెపరేషన్, గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థల పనితీరును అంతరిక్షంలో పరీక్షించి కీలక సాంకేతిక సమాచారాన్ని సేకరించనున్నారు. భవిష్యత్తులో వాణిజ్య ప్రయోగాలకు అవసరమైన సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా సంస్థ పేర్కొంది.

### పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో..

సుమారు ఏడు అంతస్తుల భవనం ఎత్తుతో రూపొందించిన విక్రమ్-1 పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో తయారైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు, ఘన ఇంధన బూస్టర్లతో పనిచేసే ఈ రాకెట్ 450 కిలోమీటర్ల ఎత్తులోని లో ఎర్త్ ఆర్బిట్‌లో 350 కిలోల వరకు చిన్న ఉపగ్రహాలను ప్రవేశపెట్టగల సామర్థ్యం కలిగి ఉంది.ఇప్పటికే 2022లో విక్రమ్-ఎస్ ద్వారా భారత తొలి ప్రైవేట్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన స్కైరూట్... ఇప్పుడు 'విక్రమ్-1'తో దేశపు తొలి ప్రైవేట్ ఆర్బిటల్ ప్రయోగాన్ని విజయవంతం చేసి భారత అంతరిక్ష రంగ చరిత్రలో మరో అరుదైన ఘట్టాన్ని లిఖించింది.

# పెసరపప్పు vs కందిపప్పు.. ఆరోగ్యానికి ఏది మంచిది..?

## గ్యాస్ సమస్య రావొద్దంటే ఏది తినాలో తెలుసుకోండి..

భారతీయ వంటగదిలో పప్పు లేని రోజును ఊహించుకోవడం కష్టం. మధ్యాహ్న భోజనం అయినా, రాత్రి సింపుల్ డిన్నర్ అయినా.. పప్పు ఖచ్చితంగా ప్లేట్ లో ఉండాల్సిందే. అయితే మార్కెట్‌కు వెళ్లినప్పుడు లేదా ఇంట్లో వండేటప్పుడు చాలా మందికి వచ్చే ఒకే ఒక్క సందేహం: పెసరపప్పు మంచిదా? లేక కందిపప్పు మంచిదా? రోజూ ఏది తింటే ఆరోగ్యం? ఈ రెండింటిలో ఏది ఉత్తమం అనేది కేవలం పోషకాలపైనే కాదు.. మీ జీర్ణశక్తి, వంట శైలి, మీ శరీర తత్వంపై ఆధారపడి ఉంటుంది.మీరు చాలా తేలికైన, పొట్టకు హాయినిచ్చే ఆహారం తినాలనుకుంటే పెసరపప్పు సరైన ఎంపిక. ఇది చాలా సులభంగా అరుగుతుంది. అందుకే అనారోగ్యంతో ఉన్నప్పుడు లేదా పొట్ట కాస్త అప్సెట్ అయినప్పుడు వైద్యులు పెసరపప్పు కిచేరి లేదా పెసరకట్టు తినమని సలహా ఇస్తారు. దీని రుచి చాలా మైల్డ్ ఉంటుంది. త్వరగా ఉడుకుతుంది. రాత్రి వేళల్లో తేలికపాటి భోజనం చేయాలనుకున్నప్పుడు లేదా గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యలు ఇబ్బంది పెడుతున్నప్పుడు పెసరపప్పు ఉత్తమమైనది.మన దేశంలో అత్యధిక ఇళ్లలో ప్రతిరోజూ వాడేది కందిపప్పే. కందిపప్పుకు కమ్మటి, బలమైన రుచి ఉంటుంది. ఇది తిన్న తర్వాత కడుపు నిండిన అనుభూతిని ఇస్తుంది. మధ్యాహ్న భోజనానికి ఇది పర్ఫెక్ట్ జోడీ. కొందరిలో కందిపప్పు తింటే కాస్త బరువుగా అనిపించడం లేదా గ్యాస్ రావడం జరగొచ్చు. అలాంటప్పుడు పప్పును వండటానికి ముందు కాసేపు నానబెట్టడం, వండేటప్పుడు కొద్దిగా ఇంగువ, వెల్లుల్లి చేర్చడం వల్ల ఈ సమస్య తగ్గుతుంది.పోషకాల పరంగా చూస్తే ఈ రెండింటి మధ్య పెద్ద తేడా ఏమీ లేదు. రెండు పప్పులూ పల్సెస్ జాబితాకే చెందుతాయి. రెండింటిలోనూ శరీరానికి కావలసిన విటమిన్లు, ఖనిజాలు, పీచుపదార్థం నాణ్యమైన ప్లాంట్ ప్రోటీన్ పుష్కలంగా లభిస్తాయి. కాబట్టి ఒకదాని కంటే ఇంకొకటి గొప్పదని ఖచ్చితంగా చెప్పలేం. పరిశోధనల ప్రకారం కూడా రెండు పప్పులు శరీరానికి వేర్వేరు రకాలుగా మేలు చేస్తాయి. మీ ఆనాటి భోజన అవసరాన్ని బట్టి ఏది వండుకోవాలనేది మారుతుంది.న్యూట్రిషన్ నిపుణుల ప్రకారం.. డైట్‌లో ఏదో ఒక పప్పుపైనే ఆధారపడటం కంటే రెండింటినీ మార్చి మార్చి తినడం అత్యంత ఆరోగ్యకరమైన పద్ధతి. తేలికపాటి భోజనం, సులభమైన జీర్ణక్రియ కావాలనుకున్నప్పుడు పెసరపప్పును, కమ్మటి రుచి, కడుపు నిండే భోజనం కావాలనుకున్నప్పుడు కందిపప్పును ఎంచుకోవాలి. ఒకే రకమైన పప్పుకు పరిమితం కాకుండా వారంలో రెండు పప్పులను వాడుకుంటూ వైవిధ్యాన్ని కాపాడుకుంటే రుచితో పాటు సంపూర్ణ ఆరోగ్యం మీ సొంతమవుతుంది.మార్కెట్లో పప్పులు కొనేటప్పుడు నాణ్యమైనవి, తాజాగా ఉన్నవి ఎంచుకోవడం కూడా అంతే ముఖ్యం. ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో కొనేటప్పుడు ప్యాకెట్ వెనుక ఉన్న వివరాలను జాగ్రత్తగా గమనించాలి. ఎందుకంటే పెసరపప్పులో పొట్టు పప్పు, ముడి పప్పు, పసుపు పప్పు అని రకాలు ఉంటాయి. అలాగే కందిపప్పులోనూ రకాలు ఉంటాయి.

# వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించినా ఉద్యమం ఆగదు

- **నేటి నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేపడతా: అభిజీత్ దీప్కే**
- **జులై 20న 'చలో సంసద్' పాదయాత్ర యథావిధిగా నిర్వహిస్తామని ప్రకటన**
- **సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి వద్ద భారీ భద్రత.. డీహైడ్రేషన్‌తో చికిత్స పొందుతున్న వాంగ్‌చుక్**
- **వైద్య వివరాలు ఇవ్వడం లేదని ఆసుపత్రి సిబ్బందిపై భార్య ఆగ్రహం**

**న్యూఢిల్లీ, వెలుతురు జూలై 18:**



పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను బలవంతంగా ఆసుపత్రికి తరలించినప్పటికీ తమ ఉద్యమం ఏమాత్రం ఆగదని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్షకు కొనసాగింపుగా తానే నేటి నుంచి నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, మద్దతుదారులంతా ఐక్యంగా పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా అభిజీత్ దీప్కే మాట్లాడుతూ.. ''ఈ రోజు నుంచి నేను నిరవధిక నిరాహార దీక్ష చేపడుతున్నాను. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయవద్దు. దేశం నలుమూలల నుంచి మద్దతుదారులు జంతర్‌మంతర్‌కు చేరుకోవాలి. జులై 20న నిర్వహించనున్న 'చలో సంసద్' పాదయాత్రను యథావిధిగా కొనసాగిస్తాం'' అని తెలిపారు.కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో కొన్ని వారాల క్రితం కాక్రోచ్ జనతా పార్టీ ఢిల్లీలో ఆందోళనలు ప్రారంభించింది.

ఈ నిరసనల్లో భాగంగానే సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. జులై 20న పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అదే రోజు పార్లమెంట్ వరకు శాంతియుతంగా 'చలో సంసద్' పాదయాత్ర నిర్వహిస్తామని పార్టీ ఇప్పటికే ప్రకటించింది. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చింది.ఇదిలా ఉండగా, నిరాహార దీక్ష కారణంగా సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణించడంతో అధికారులు ఆయనను ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వద్ద భారీ ఎత్తున భద్రతను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి వైద్యులు ప్రకటన విడుదల చేశారు. దీర్ఘకాల నిరాహార దీక్ష వల్ల ఆయన తీవ్ర బలహీనతకు గురయ్యారని, శరీరంలో నీటి శాతం తగ్గి డీహైడ్రేషన్ లక్షణాలు కనిపిస్తున్నాయని తెలిపారు. ఆయనకు నిరంతర వైద్య పర్యవేక్షణతో పాటు అవసరమైన చికిత్స అందిస్తున్నామని వెల్లడించారు.మరోవైపు, ఆసుపత్రి సిబ్బంది వ్యవహారంపై వాంగ్‌చుక్ భార్య తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలోకి మొబైల్ ఫోన్ తీసుకెళ్లేందుకు అనుమతించలేదని, వాంగ్‌చుక్‌కు నిర్వహించిన వైద్య పరీక్షల వివరాల ప్రతులను కూడా అందించడం లేదని ఆరోపించారు. ఇందుకు గల కారణాలను వెల్లడించాలని ఆసుపత్రి అధికారులను ఆమె ప్రశ్నించారు.వాంగ్‌చుక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పటికీ ఉద్యమం ఆగదని, ముందుగా ప్రకటించిన అన్ని కార్యక్రమాలను యథావిధిగా నిర్వహిస్తామని కాక్రోచ్ జనతా పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. జులై 20న జరగనున్న 'చలో సంసద్' కార్యక్రమంపై దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# ఢిల్లీ ఎయిమ్స్ కు లాలూ ప్రసాద్ తరలింపు

- మెరుగైన వైద్యం కోసం ఎయిమ్స్‌కు..
- ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందన్న వైద్యులు
- రక్తపోటు హెచ్చుతగ్గులతో పట్నాలో ఆసుపత్రిలో చేరిన లాలూ ప్రసాద్
- ఆరోగ్యం నిలకడగా ఉండటంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్
- తదుపరి పరీక్షల కోసం ఢిల్లీ ఎయిమ్స్‌కు తరలింపు
- 2022లో సింగపూర్‌లో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న ఆర్‌జేడీ అధినేత

**బీహార్ వెలుతురు జూలై 18:**



రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌ను మెరుగైన వైద్యం కోసం శనివారం ఢిల్లీలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థకు తరలించనున్నారు. రక్తపోటు హెచ్చుతగ్గులకు గురికావడంతో శుక్రవారం సాయంత్రం ఆయనను పట్నాలోని ఇందిరా గాంధీ వైద్య విజ్ఞాన సంస్థలో చేర్చగా, చికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండటంతో వైద్యులు డిశ్చార్జ్ చేశారు.ఆసుపత్రి నుంచి ఇంటికి తీసుకొచ్చిన అనంతరం వైద్యుల పర్యవేక్షణలో ఉంచిన లాలూ ప్రసాద్‌ను తదుపరి వైద్య పరీక్షలు, ప్రత్యేక చికిత్స కోసం ఢిల్లీకి తరలించనున్నట్లు ఆయన పెద్ద కుమార్తె, ఆర్‌జేడీ ఎంపీ మిసా భారతి వెల్లడించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా లేదని, వైద్యుల సూచన మేరకే ఢిల్లీకి తీసుకెళ్తున్నట్లు తెలిపారు.లాలూ ప్రసాద్ గత కొన్నేళ్లుగా పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. మూత్రపిండాల సమస్యలు, గుండె సంబంధిత ఇబ్బందులతో పాటు ఇతర అనారోగ్య కారణాల వల్ల పలుమార్లు ఆసుపత్రిలో చికిత్స పొందారు. 2022 డిసెంబరులో సింగపూర్‌లో ఆయనకు కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. అప్పటి నుంచి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల పర్యవేక్షణలో కొనసాగుతున్నారు.లాలూ ప్రసాద్ ఆరోగ్య పరిస్థితిపై పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆరా తీస్తుండగా, ఆయన త్వరగా కోలుకోవాలని పలువురు రాజకీయ ప్రముఖులు ఆకాంక్ష వ్యక్తం చేస్తున్నారు.

# హర్మూజ్‌లో పేలిన చమురు ట్యాంకర్లు

- ఐఆర్‌జీసీ సంచలన ప్రకటన..
- 'అది అవాస్తవం' అంటూ ఖండించిన అమెరికా
- హర్మూజ్ జలసంధిలో రెండు ట్యాంకర్లు పేలిపోయాయని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ప్రకటన
- అమెరికా నిఘా సంస్థలే ఆ మార్గంలో పంపాయని ఐఆర్‌జీసీ ఆరోపణ
- ఈ వాదనను పూర్తిగా ఖండించిన అమెరికా సెంట్‌కామ్
- యుద్ధం మరింత ఉధృతం.. బాబ్ అల్-మాండెబ్‌పైనా ఉద్రిక్తతలు

**టెహ్రాన్**



పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రమవుతున్నాయి. ప్రపంచ ఇంధన సరఫరాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి చుట్టూ సైనిక ఉద్రిక్తతలు కొనసాగుతుండగా, సముద్ర మైన్లు (మందుపాతరలు) మరో పెద్ద ముప్పుగా మారాయి. ఈ నేపథ్యంలో హర్మూజ్ జలసంధిలో రెండు చమురు ట్యాంకర్లు మైన్లను ఢీకొని పేలిపోయాయని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) శనివారం ప్రకటించింది. అయితే ఈ వాదనను అమెరికా సెంట్రల్ కమాండ్ వెంటనే ఖండిస్తూ, "ఇది పూర్తిగా అవాస్తవం" అని స్పష్టం చేసింది. ఐఆర్‌జీసీ ప్రకటన ప్రకారం.. అమెరికా నిఘా సంస్థల సూచనలతో హర్మూజ్ దక్షిణ భాగంలోని మైన్లు ఉన్న మార్గంలో రెండు చమురు ట్యాంకర్లు ప్రయాణించాయని, దీంతో అవి పేలిపోయి మంటలకు ఆహుతయ్యాయని పేర్కొంది. అలాగే అదే మార్గంలో వెళ్లేందుకు ప్రయత్నించిన మరో నాలుగు నౌకలను క్షిపణులు, డ్రోన్ల సాయంతో అడ్డుకున్నామని వెల్లడించింది. అయితే ఈ ఘటనకు సంబంధించి ట్యాంకర్ల వివరాలు, స్వతంత్ర ధ్రువీకరణ మాత్రం వెలువడలేదు. మరోవైపు అమెరికా వరుసగా ఏడో రోజు కూడా ఇరాన్‌పై వైమానిక దాడులు కొనసాగించింది. దక్షిణ ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లో భారీ పేలుళ్లు చోటుచేసుకున్నట్లు సమాచారం. అమెరికా దాడులు కొనసాగితే తాము పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధమవుతామని ఇరాన్ హెచ్చరించింది. అలాగే అమెరికా మిత్రదేశాల్లోని సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో ప్రతీకార దాడులను కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. ఇదే సమయంలో తమ విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించిన ఇరాన్.. ఎర్ర సముద్రంలోని బాబ్ అల్-మాండెబ్ జలసంధిలో సముద్ర రవాణాకు అంతరాయం కల్పించే అవకాశాన్ని కూడా ప్రస్తావించింది. ఇరాన్‌కు మద్దతుగా ఉన్న హూతీ బలగాలు ఆ మార్గంలో చర్యలు చేపడితే ప్రపంచ చమురు, వాణిజ్య సరఫరా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# బుల్లెట్ ట్రైన్ భూసేకరణపై ఉద్రిక్తత



- హైడ్రా అధికారులను అడ్డుకున్న రైతులు
- తోపులాటలో ఓ రైతు అస్వస్థత
- 650 ఎకరాలకు కంచె వేసేందుకు వెళ్లిన రెవెన్యూ, హైడ్రా అధికారులకు నిరసన
- ఆర్డీవోతో వాగ్వాదం.. నినాదాలతో ఆందోళనకు దిగిన స్థానికులు
- పోలీసులతో తోపులాటలో రైతు నరసింహ స్పృహతప్పి పడిపోవడం
- సమస్య పరిష్కరించాకే కంచె వేయాలని రైతుల డిమాండ్

**రంగారెడ్డి, వెలుతురు జూలై 18:**

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని బహదూర్‌గూడలో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం చేపట్టిన భూసేకరణ వ్యవహారం ఉద్రిక్తతకు దారితీసింది. ప్రాజెక్టు కోసం సేకరించిన సుమారు 650 ఎకరాల భూమికి కంచె ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ అధికారులు, హైడ్రా సిబ్బంది పోలీసు బందోబస్తుతో శనివారం అక్కడికి చేరుకోగా, స్థానిక రైతులు, భూ యజమానులు వారిని అడ్డుకున్నారు.భూములకు కంచె వేయొద్దంటూ రైతులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీధర్‌తో స్థానికులు తీవ్ర వాగ్వాదానికి దిగారు. తమ సమస్యలు పరిష్కరించకుండా, భూ వివాదాలను పరిష్కరించకుండా కంచె వేయడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రైతులను వెనక్కి పంపే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో రైతులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో రైతు నరసింహ అస్వస్థతకు గురై స్పృహతప్పి కుప్పకూలారు. వెంటనే అధికారులు ఆయనను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించగా, తోటి రైతులు అడ్డుకుని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.తమకు న్యాయం జరిగే వరకు, భూసేకరణకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కంచె వేయడానికి అనుమతించబోమని రైతులు స్పష్టం చేశారు. భూములకు తగిన పరిహారం, ఇతర హామీలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.ఘటన నేపథ్యంలో బహదూర్‌గూడలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. రైతులతో చర్చలు జరిపి సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# ట్రాన్స్‌జెండర్లకు రాజకీయ సాధికారతకు శ్రీకారం





- పథకాలకే కాకుండా పాలనలో భాగస్వామ్యం
- స్థానిక సంస్థల్లో కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం
- సచివాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఘన సన్మానం

**హైదరాబాద్, వెలుతురు జూలై 18:**

"మానత్వం మాటల్లో కాదు... అవకాశాల్లో కనిపించాలనే సంకల్పంతో ఇందిరమ్మ రాజ్యం ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ట్రాన్స్‌జెండర్ సమాజానికి స్థానిక సంస్థల్లో కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించే ప్రక్రియకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం సామాజిక న్యాయానికి, రాజ్యాంగ స్ఫూర్తికి నిదర్శనం. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయం ట్రాన్స్‌జెండర్ సమాజానికి గౌరవం, గుర్తింపు, నాయకత్వానికి నాంది పలుకుతోంది" అని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు పేర్కొన్నారు.శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో తెలంగాణకు చెందిన సుమారు 25 మంది ట్రాన్స్‌జెండర్ లు...ట్రాన్స్ ఉమెన్ హక్కుల ఉద్యమ కారులు , ట్రాన్స్‌మెన్ హక్కుల ఉద్యమకారులు , ట్రాన్స్ హిజ్రా సంస్కృతి గురువులు, ట్రాన్స్ జెండర్ వ్యక్తుల తో పాటు వివిధ ట్రాన్స్‌జెండర్ సంఘాల ప్రతినిధులు మంత్రిని కలిసి రాష్ట్ర కేబినెట్ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయానికి ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరికి శాలువాతో సన్మానం చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... ట్రాన్స్‌జెండర్ సమాజాన్ని సంక్షేమ పథకాలకే పరిమితం చేయకుండా పాలనలో భాగస్వాములను చేయాలన్న దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. స్థానిక సంస్థల్లో కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించడం ద్వారా గ్రామాలు, మండలాలు, పట్టణాల అభివృద్ధిలో ట్రాన్స్‌జెండర్ ప్రతినిధుల స్వరం వినిపించే అవకాశం కలుగుతుందని తెలిపారు.ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల ఆర్థిక, సామాజిక సాధికారత కోసం పలు వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. డ్రైవింగ్, వంట (కుకింగ్), డ్రోన్ నిర్వహణ వంటి నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించడంతో పాటు, మెట్రో స్టేషన్లలో ఉపాధి అవకాశాలు కల్పించామని తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థలో కూడా ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సేవలను వినియోగిస్తూ వారికి గౌరవప్రదమైన జీవనోపాధి కల్పిస్తున్నామని చెప్పారు.ఇప్పుడు స్థానిక సంస్థల్లో కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించడం ద్వారా ట్రాన్స్‌జెండర్ సమాజానికి రాజకీయ సాధికారత కూడా కల్పిస్తున్నామని, ఇది దేశానికే ఆదర్శంగా నిలిచే నిర్ణయమని మంత్రి పేర్కొన్నారు.ట్రాన్స్‌జెండర్ ప్రతినిధులు మాట్లాడుతూ... తమకు గౌరవప్రదమైన స్థానం కల్పించే దిశగా చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి, తమ సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం తమలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిందని, సమాజాభివృద్ధిలో మరింత బాధ్యతతో భాగస్వాములమవుతామని పేర్కొన్నారు.

# స్కైరూట్ బృందానికి ప్రధాని మోదీ అభినందనలు

- ఇది తొలి అడుగు మాత్రమే..
- ఇంకా గొప్ప విజయాలు సాధించాలి' అంటూ ప్రశంసలు
- విక్రమ్-1 విజయవంతమైన ప్రయోగం అనంతరం స్కైరూట్ వ్యవస్థాపకులకు ఫోన్ చేసిన ప్రధాని
- పవన్‌కుమార్ చందన, నాగ్ భరత్‌తో మాట్లాడిన మోదీ

**న్యూఢిల్లీ, వెలుతురు జూలై 18:**



భారత అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచిన స్కైరూట్ ఏరోస్పేస్ తొలి ఆర్బిటల్ క్లాస్ రాకెట్ 'విక్రమ్-1' విజయవంతమైన ప్రయోగంపై ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రయోగం విజయవంతంగా పూర్తైన అనంతరం స్కైరూట్ వ్యవస్థాపకులు పవన్‌కుమార్ చందన, నాగ్ భరత్‌కు ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రయోగాన్ని తాను ప్రత్యక్షంగా వీక్షించినట్లు ప్రధాని తెలిపారు. ''మీరు అనుకున్న సమయానికంటే ముందుగానే మీ లక్ష్యాలను సాధించారు. ఈ ప్రయోగాన్ని నేను వీక్షించాను. ఇందులో భాగమైన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు, కృతజ్ఞతలు. ఈ మిషన్ కేవలం తొలి అడుగు మాత్రమే. దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లి భారత అంతరిక్ష రంగాన్ని కొత్త శిఖరాలకు చేర్చాలి'' అని మోదీ పేర్కొన్నారు.విక్రమ్-1 విజయంతో భారత ప్రైవేటు అంతరిక్ష రంగం కొత్త యుగంలోకి అడుగుపెట్టిందని ఆయన అభినందించారు. స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన ఈ రాకెట్ దేశ యువ శాస్త్రవేత్తల ప్రతిభకు, భారత స్టార్టప్‌ల సామర్థ్యానికి ప్రతీకగా నిలిచిందని కొనియాడారు.మరోవైపు, ప్రధాని నుంచి అభినందనలు అందుకోవడం తమకు గర్వకారణమని స్కైరూట్ వ్యవస్థాపకులు తెలిపారు. భారత అంతరిక్ష రంగంలో మరిన్ని వినూత్న ప్రయోగాలు చేపట్టి ప్రపంచ స్థాయిలో దేశ ప్రతిష్ఠను మరింత పెంచేందుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.విక్రమ్-1 విజయవంతమైన ప్రయోగంతో చిన్న ఉపగ్రహాల వాణిజ్య ప్రయోగాల రంగంలో భారత్‌కు కొత్త అవకాశాలు తెరుచుకున్నాయి. ఈ విజయం దేశీయ స్పేస్‌టెక్ స్టార్టప్‌లకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని అంతరిక్ష రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఎల్ నినో ప్రభావం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వర్షాభావ పరిస్థితులు, సన్నద్ధతపై సమీక్ష నిర్వహించనున్న మంత్రి జూపల్లి కృష్ణారావు




- ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఈ నెల 20న మంత్రి జూపల్లి సమీక్ష
- నాలుగు జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో ఉట్నూరులో సమావేశం

**ఉట్నూరు వెలుతురు జూలై 18:**

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు



పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, మద్యనిషేధం & ఎక్సైజ్ శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ నెల 20న ఉట్నూరులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. వర్షాభావ పరిస్థితులు, ప్రత్యామ్నాయ ప్రణాళికల అమలుకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేయనున్నారు.ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే సమీక్షలో ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, శాఖల సమన్వయం, అత్యవసర కార్యాచరణపై సమగ్రంగా చర్చించనున్నారు.వ్యవసాయం, ఉద్యానవనం, మార్క్‌ఫెడ్, సాగునీటి శాఖ, మిషన్ భగీరథ, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ (టీజీఎన్‌పీడీసీఎల్), అటవీ, పౌర సరఫరాలు, వైద్య ఆరోగ్య, మహిళా-శిశు సంక్షేమ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొని తమ శాఖల సన్నద్ధతపై వివరాలు సమర్పించనున్నారు.

# ఆషాఢ మాస బోనాల సందర్భంగా హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన కులవృత్తుల మేళాకు విశేష స్పందన

- **నేడు ఆదివారం సెలవు దినాన్ని సద్వినియోగం చేసుకొని మేళాను సందర్శించి బీసీ కళాకారులను ప్రోత్సహించండి - మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్, వెలుతురు జూలై 18:**







ఆషాఢ బోనాల ఉత్సవాల సందర్భంగా హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన కులవృత్తుల మేళాకు నగర ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బోనాల పండుగకు అవసరమైన కుండలు, బుట్టలు, మట్టి పాత్రలు తదితర సంప్రదాయ వస్తువులను పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తూ ప్రజలు కళాకారులను ప్రోత్సహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.మొత్తం 60 స్టాళ్లతో 15 రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ కులవృత్తుల మేళాను రేపు ఆదివారం సెలవు దినం సందర్భంగా కుటుంబ సమేతంగా సందర్శించి, బీసీ వర్గాలకు చెందిన కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదాయ కులవృత్తులకు నూతన ఊతమిస్తూ, బీసీ వర్గాలకు చెందిన కళాకారులు తమ ఉత్పత్తులను నేరుగా ప్రజలకు విక్రయించుకునేందుకు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా సంప్రదాయ వృత్తులకు ప్రోత్సాహం లభించడంతో పాటు వేలాది మంది కళాకారుల జీవనోపాధికి భరోసా కలుగుతుందని చెప్పారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానంలో అంతర్భాగంగా ఉన్న అనేక కులవృత్తులు కనుమరుగు కాకుండా కాపాడేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయని మంత్రి పేర్కొన్నారు. ఈ వృత్తులు రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడమే కాకుండా పర్యావరణహితమైన, ఆరోగ్యకరమైన జీవనశైలిని కూడా ప్రోత్సహిస్తాయని అన్నారు.ఈ ప్రదర్శనలో టెర్రకోట ఉత్పత్తులు, మట్టి పాత్రలు, జనపనార ఉత్పత్తులు, మేదర బుట్టలు, గద్వాల్ చీరలు, పోచంపల్లి ఇకత్ చేనేత వస్త్రాలు, నిర్మల్ బొమ్మలు, నిర్మల్ చిత్రకళా ఉత్పత్తులు, వెండి ఫిలిగ్రీ కళాఖండాలు, వరాహి హస్తకళ ఉత్పత్తులు, వరంగల్ దుర్రీలు, నారాయణపేట చేనేత వస్త్రాలు, పెంబర్తి ఇత్తడి కళాఖండాలు, సెర్ప్, మెప్మా ఆధ్వర్యంలోని సేంద్రీయ ఆహార ఉత్పత్తులు, రానున్న వినాయక చవితి సందర్భంగా పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలు, పూసల కళాఖండాలు, సంప్రదాయ ఔషధాలు, విశ్వకర్మ కళాకారుల ఉత్పత్తులు, ప్రభుత్వ విజయ డెయిరీ ఉత్పత్తులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు.ప్రదర్శనలో పాల్గొన్న కళాకారుల నైపుణ్యాన్ని మంత్రి అభినందిస్తూ, తమ సంప్రదాయ కళలు, కులవృత్తులను భావితరాలకు అందించే దిశగా నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజలు స్థానిక కళాకారుల ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా సంప్రదాయ కులవృత్తులను పరిరక్షించడమే కాకుండా వేలాది మంది కళాకారుల కుటుంబాలకు అండగా నిలుస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# షీర్ కుర్మా.. ఇలా చేస్తే సూపర్ రుచి.. మళ్ళీ మళ్ళీ కావాలంటారు!



సన్న సేమ్యాతో చేసే షీర్ కుర్మా.. ఇది ముఖ్యంగా రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు ఎక్కువగా చేసే రుచికరమైన సాంప్రదాయకమైన స్వీట్. పర్షియన్ భాషలో షీర్ అంటే పాలు అని, కుర్మా అంటే ఖర్జూరం అని అర్థం. చిక్కటి పాలతో, నెయ్యిలో రోస్ట్ చేసిన సేమియా వేసి, డ్రై ఫ్రూట్స్ మరియు ఖర్జూరపండ్లు కలయికతో చేసే ఈ పాయసం తినడానికి చాలా బాగుంటుంది. ఈ షీర్ కుర్మా తయారీ తెలుసుకుందాం.

తయారీకి కావలసిన పదార్థాలు చిక్కటి పాలు ఒక లీటరు సన్న సేమ్యా: అర కప్పు చక్కెర: అరకప్పు నెయ్యి ; మూడు నుండి నాలుగు టేబుల్ స్పూన్లు మిక్స్డ్ డ్రై ఫ్రూట్స్ : అరకప్పు( జీడిపప్పు, బాదంపప్పు, పిస్తా, సారపప్పు, ఖర్జూరం సన్నగా తరిగినవి) యాలకుల పొడి: 1 స్పూన్ కుంకుమపువ్వు: కొద్దిగా రోజ్ వాటర్: 1 టీ స్పూన్

తయారీ విధానం ఒక మందపాటి గిన్నెలో నెయ్యి వేడి చేసి సన్నగా తరిగిన డ్రై ఫ్రూట్స్ ముక్కలను వేసి వేయించుకోవాలి. దోరగా వేగిన తర్వాత వాటిని తీసి పక్కన పెట్టుకోవాలి. అందులోనే మరికొంత నెయ్యి వేసుకుని సన్న సేమ్యా ను వేసి సిమ్ లో పెట్టి గోల్డెన్ రంగు వచ్చేవరకు వేయించుకోవాలి.

ఇవి త్వరగా మాడిపోతాయి కాబట్టి సిమ్ లో పెట్టి మాత్రమే వేయించుకోవాలి. ఇలా చేస్తే సూపర్ టేస్ట్ ఆ తర్వాత ఒక మందపాటి పాన్ లో లీటర్ పాలు పోసుకుని బాగా మరిగించుకోవాలి. పాలు బాగా మరిగిన తర్వాత అందులో చక్కెర వేసుకొని కలుపుకోవాలి. ఆపై వేయించి పెట్టుకున్న సన్న సేమ్యా ను యాడ్ చేయాలి. అందులో యాలుకల పొడి, వేయించి పెట్టుకున్న డ్రై ఫ్రూట్స్ వేసి, కుంకుమపువ్వు, రోజ్ వాటర్ వేసి మూత పెట్టి స్టవ్ ఆఫ్ చేయాలి. అంతే రుచికరమైన షీర్ కుర్మా రెడీ అవుతుంది.

అందరూ ఇష్టంగా తినే స్వీట్ ఇది చల్లబడే కొద్ది చిక్కబడుతుంది. కాబట్టి పలుచగా ఉన్నప్పుడే దీనిని ఆఫ్ చేసుకోవాలి. వేయించిన సన్న సేమ్యా వేసిన తర్వాత ఎక్కువసేపు ఉడికించకూడదు. అలా ఉడికిస్తే షీర్ కుర్మా టేస్ట్ మారుతుంది. తక్కువ సమయంలో ఇంటికి వచ్చిన అతిథులకు సంతోషం కలిగించే ఈ స్వీట్ ను తయారుచేసి పెట్టండి. కచ్చితంగా అందరూ ఇష్టంగా తింటారు.

# 23 గ్రామ పంచాయతీలకు నాణ్యత ప్రమాణాల గుర్తింపు

- **గ్రామీణ పరిపాలనలో ఏపీని దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడి**

**అమరావతి వెలుతురు జూలై 18:**



సమర్థవంతమైన పాలనకు బలమైన వ్యవస్థలే పునాదిగా నిలుస్తాయని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్రంలోని 23 గ్రామ పంచాయతీలు అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాల గుర్తింపు పొందడం గర్వకారణమని పేర్కొంటూ ఆయా గ్రామ పంచాయతీలను అభినందించారు. ఈ గుర్తింపు సాధించడంలో కృషి చేసిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందిని ప్రత్యేకంగా ప్రశంసించారు.ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో పలు సంస్కరణలు అమలు చేస్తోందని పవన్ కల్యాణ్ తెలిపారు. పౌర సేవల ప్రణాళిక అమలు, ఫిర్యాదుల వేగవంతమైన పరిష్కారం, తాగునీటి సదుపాయాల మెరుగుదల, దివ్యాంగులకు అనుకూల వసతులు, సమాచార ఫలకాల ఏర్పాటు, రికార్డుల డిజిటలీకరణ, పత్రాల శాస్త్రీయ నిర్వహణ, కార్యాలయాల పరిశుభ్రత, ప్రభుత్వ ఆస్తుల సమర్థ నిర్వహణ, అగ్నిప్రమాద నివారణ ప్రమాణాలు, అంతర్గత తనిఖీలు, సిబ్బందికి నిరంతర శిక్షణ, క్రమం తప్పని సమీక్షలు వంటి ఉత్తమ పాలనా విధానాలను అమలు చేస్తున్నట్లు వివరించారు.ఈ నాణ్యత గుర్తింపు కేవలం ఒక పురస్కారం మాత్రమే కాదని, గ్రామ పంచాయతీల్లో ప్రజాకేంద్రిత, పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన సుపరిపాలనకు ఇది ప్రపంచ స్థాయి ప్రమాణమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ గుర్తింపు ద్వారా గ్రామీణ పరిపాలనలో సేవల నాణ్యత మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్రంలోని 13 వేలకుపైగా గ్రామ పంచాయతీలకు ఈ 23 గ్రామ పంచాయతీలు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ప్రతి గ్రామంలో మరింత నాణ్యమైన సేవలు, సమర్థవంతమైన పరిపాలన అందించే కొత్త ప్రమాణాలకు ఇవి నాంది పలకాలని ఆకాంక్షించారు. గ్రామీణాభివృద్ధి, సుపరిపాలన రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌ను దేశానికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# కాంగ్రెస్, బిఆర్ఎస్ దొంగలు దొంగలు కలిసి తెలంగాణను...

(మొదటి పేజీ తరువాయి)

మళ్లీ అధికారం ఎలా సంపాదించాలనే స్వార్థంతో పెట్టిన సభ మాత్రమేనని స్పష్టం చేశారు. "ఇంటికో ఉద్యోగం", "కేజీ టు పీజీ ఉచిత విద్య", "దళితుడే ముఖ్యమంత్రి" అంటూ నమ్మించి మోసం చేసిన ఘనత బిఆర్ఎస్‌ది కాదా అని నిలదీశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బిజెపి కిసాన్ మోర్చా జాతీయ నాయకులు శ్రీధర్ రెడ్డి, బిజెపి అధికార ప్రతినిధి డాక్టర్ ఇంద్రసేనారెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు విక్రమ్ రెడ్డి, బిజెపి మీడియా ప్యానలిస్ట్ మహేష్ నామానీ, ఓయూ జేఏసీ కన్వీనర్ సురేష్ యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలను నిర్బంధ శిబిరాలుగా మార్చి, విద్యార్థులను టార్చర్ పెట్టిన కేసీఆర్, కేటీఆర్ ఇవాళ నిరుద్యోగుల గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో 76 శాతం అసిస్టెంట్ ప్రొఫెసర్, నాన్-టీచింగ్ పోస్టులను ఖాళీగా పెట్టి, యూనివర్సిటీలను అంధకారంలోకి నెట్టారని ఆరోపించారు. కేవలం పోలీస్ కానిస్టేబుళ్లు, ఉపాధ్యాయ పోస్టులు మినహా మరే ఇతర నియామకాలు చేపట్టలేదన్నారు. గ్రూప్-1 పేపర్‌ను మూడుసార్లు లీక్ చేసి, పరీక్షలను వాయిదా వేస్తూ యువత జీవితాలతో ఆడుకున్నారని దుయ్యబట్టారు. 35 లక్షల మంది యువకులు ఉద్యోగాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకుంటే, కనీసం నిరుద్యోగ భృతి ఇవ్వకుండా.. "నిరుద్యోగి అంటే ఎవరో డిఫైన్ చేయలేదు" అంటూ అసెంబ్లీ సాక్షిగా కేటీఆర్ సిగ్గులేకుండా మాట్లాడారని గుర్తుచేశారు. విఆర్ఓ వ్యవస్థను రద్దు చేసి 178 మంది ఆత్మహత్యలకు, 104 అంబులెన్స్ ఉద్యోగుల తొలగింపునకు, జీవో 46, జీవో 317 లతో ఉద్యోగుల ఇబ్బందులకు బిఆర్ఎస్ ప్రభుత్వమే కారణమన్నారు. కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సునీల్ నాయక్, ప్రవళిక, కొప్పుల రాజు, గొల్ల గణేష్ లాంటి ఎంతోమంది నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమైన కేటీఆర్.. చంపినోడే సంతాప సభ పెట్టినట్లు ఇవాళ నిరుద్యోగ సభలు పెడుతున్నారని, ఇంటికో ఉద్యోగం ఇవ్వకుండా ఊరికో బెల్ట్ షాప్ ఇచ్చారని ఆరోపించారు.



**మాట తప్పిన రేవంత్ రెడ్డి మార్క్ కాంగ్రెస్ పాలన:**

ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం సైతం నిరుద్యోగులను నిలువునా వంచిస్తోందని కాసం వెంకటేశ్వర్లు విమర్శించారు. ఇదే సరూర్‌నగర్ స్టేడియంలో ప్రియాంక గాంధీ సాక్షిగా 100 రోజుల్లో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, మరి ఇప్పటివరకు ఒక్కటైనా కొత్త నోటిఫికేషన్ ఇచ్చారా అని ఛాలెంజ్ చేశారు. పాత ప్రభుత్వం వేసిన నోటిఫికేషన్లను భర్తీ చేసి తామేదో పొడిచేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1000 కోట్లు ఇస్తామని చెప్పి మాటలు చెప్పారు తప్ప, అసెంబ్లీలో కనీసం బడ్జెట్ అయినా కేటాయించారా అని ప్రశ్నించారు. నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు, రూ.10 లక్షల వడ్డీ లేని రుణాలు, పోలీస్, ఆర్టీసీ పిల్లల కోసం రెండు కొత్త యూనివర్సిటీలు, జాబ్ క్యాలెండర్ అంటూ సోనియా గాంధీ పేరుతో గ్యారంటీ పత్రాలపై సంతకాలు పెట్టి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీశారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయకుండా అవినీతిపరులను చైర్మన్లుగా కూర్చోబెట్టడమే కాంగ్రెస్ సంస్కరణా అని ఎద్దేవా చేశారు.

**కేటీఆర్‌కు బహిరంగ సవాల్:**

కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఎక్కడ రెండు కోట్ల ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించిందో తాము చార్మినార్ సాక్షిగా నిరూపించడానికి సిద్ధంగా ఉన్నామని, ఒకవేళ తాము నిరూపించలేకపోతే చార్మినార్ వరకు ముక్కు నేలకు రాస్తామని కాసం వెంకటేశ్వర్లు సవాల్ విసిరారు. మరి కేటీఆర్ తాను ఇచ్చిన హామీల ప్రకారం తెలంగాణలో ఇంటికో ఉద్యోగం ఇచ్చినట్లు నిరూపించగలరా? నిరూపించలేకపోతే తెలంగాణ భవన్ (బిఆర్ఎస్ ఆఫీస్) వరకు ముక్కు నేలకు రాస్తారా అని సవాల్ చేశారు.బిజెపి ఎల్లప్పుడూ నిరుద్యోగుల పక్షాన, ప్రజల పక్షాన ఉంటుందని.. కాంగ్రెస్, బిఆర్ఎస్ ఆడుతున్న దొంగ నాటకాలను, బూటకపు సభలను, అబద్ధపు హామీలను యువత నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగుల హక్కుల సాధన కోసం భవిష్యత్తులో బిజెపి యువమోర్చా ఆధ్వర్యంలో దీర్ఘకాలిక పోరాటాలు చేస్తామని, యువత అంతా బిజెపికి మద్దతుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

# కళకు శారీరిక పరిమితులు అడ్డుకాదు: బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి

- ఘనంగా ముగిసిన షేక్ నఫీస్ చిత్రకళా ప్రదర్శన
- కళకు శారీరక పరిమితులు అడ్డుకావు- బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి
- aచిత్ర ప్రదర్శనకు విశేష స్పందన.. భారీగా హాజరైన కళాభిమానులు

**హైదరాబాద్, వెలుతురు జూన్ 18 :**

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో సారంగి ఫౌండేషన్ ఆద్వర్యంలో మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో దివ్యాంగ కళాకారిణి షేక్ నఫీస్ రూపొందించిన చిత్ర కళ ప్రదర్శన 'హార్ట్‌టేబుల్డ్' ఘనంగా ముగిసింది. కళకు శారీరిక పరిమితులు అడ్డుకాదని సంకల్పం ఉంటే అసాధ్యమేది లేదనే సందేశాన్ని ఈ ప్రదర్శన ద్వారా సమాజానికి షేక్ నఫీస్ చాటి చెప్పారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి , విశిష్ట అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురష్కార అవార్డు గ్రహిత మెర్సీ మార్గరేట్ హాజరై.. ప్రదర్శనను సందర్శించారు. నఫీజ్ చిత్రాల్లో ప్రతిబింభించిన భావోద్వేగాలు, సామాజిక స్పృహ, కళాత్మక నైపుణ్యాన్ని వారు ప్రత్యేకంగా వారు అభినందించారు.ఈ సందర్భంగా బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి మాట్లాడుతూ దివ్యాంగత అనేది ప్రతిభకు అడ్డంకి కాదని, షేక్ నఫీస్ అద్భుత చిత్రాల ద్వారా మరోసారి నిరూపించారన్నారు. ఆమె సంకల్పం, కృషి కళ పట్ల అంకిత భావం స్ఫూర్తిదాయకమని, సమాజం ఇలాంటి ప్రతిభావంతులైన దివ్యాంగ కళాకారులను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. నఫీస్ భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ.. చిత్ర కళ ప్రదర్శను ఏర్పాటు చేసిన సారంగి ఫౌండేషన్ వ్యవస్థాకుడు ఖాజా అఫ్రిదిని ఆమె అభినందించారు. ప్రతిభను ప్రోత్సహిస్తూ ఆమె కళ ప్రయాణానికి అండగా నిలిచిన ఖాజా సేవలను కొనియాడారు.విశిష్ట అతిథి వేణు ఉడుగుల మాట్లాడుతూ షేక్ నఫీస్ చిత్రాలు కేవలం కళా ఖండాలు మాత్రమే కాదు, సంకల్పం, ఆత్మవిశ్వాసం, జీవిత పోరాటానికి ప్రతీకాలని అన్నారు. శారీరక వైకల్యం మనిషి ప్రతిభను ఎప్పటికీ అడ్డుకోలేవని నఫీస్ తన సృజనతో నిరూపించారు. ఇలాంటి కళాకారులను సమాజం మరింతగా ప్రోత్సహించి వారి ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.రచయిత్రి మెర్సీ మార్గరేట్ మాట్లాడుతూ షేక్ నఫీస్ చిత్రాలు








కేవలం రంగులతో వేసిన బొమ్మలు కావని.. అవి శరీరానికి ఏర్పడిన పరిమితులను మనసు, ఊహాశక్తి ఎలా అధిగమించగలవో చెప్పే సజీవ సాక్ష్యాలని తెలిపారు. మస్క్యులర్ డిస్ట్రోఫీ వంటి క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొంటూనే కళను తన వ్యక్తీకరణగా, తన స్వేచ్ఛగా మలచుకోవడం నిజంగా అభినందనీయమన్నారు. నఫీస్ తన కళాయాత్రలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నాని తెలిపారు. మూడ్రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన కళాభిమానులకు, చిత్రాభిమానులకు నిర్వాహకుడు ఖాజా అఫ్రిది ధన్యవాదాలు తెలిపారు.



# ఉద్యమ స్ఫూర్తి... కర్నె ప్రభాకర్



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2001లో ఆవిర్భవించిన టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) పార్టీతో తొలి అడుగు వేసిన ఆవిర్భావ సభ్యుల్లో మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఒకరు. పార్టీ ఆవిర్భావం నుంచి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు దాదాపు పద్నాలుగు సంవత్సరాల పాటు పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) నాయకత్వంలో ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. తెలంగాణ సాధనే లక్ష్యంగా సాగిన ఉద్యమంలో లాఠీచార్జీలు, అరెస్టులు, జైలు జీవితం వంటి ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ తన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగించారు.టీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, యువతలో తెలంగాణ రాష్ట్ర అవసరంపై అవగాహన కల్పించడంలో విశేషంగా కృషి చేశారు. గ్రామాల నుంచి విశ్వవిద్యాలయాల వరకు సభలు, సమావేశాలు నిర్వహిస్తూ యువతను ఉద్యమంలో భాగస్వాములను చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఉద్యమ కాలంలో యువశక్తిని పార్టీ వైపు మళ్లించడంలో ఆయన చేసిన సేవలను పార్టీ శ్రేణులు ఇప్పటికీ సందర్భం వచ్చిన ప్రతిసారి గుర్తుచేసుకుంటారు. పార్టీలో రాష్ట్ర కార్యదర్శిగా, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్‌గా, పలు ఎన్నికల్లో ఇన్‌చార్జిగా పనిచేస్తూ అప్పగించిన ప్రతి బాధ్యతను క్రమశిక్షణతో, నిబద్ధతతో నిర్వర్తించారు. పార్టీ బలోపేతం కోసం నిరంతరం శ్రమిస్తూ కేసీఆర్‌కు అత్యంత సన్నిహిత సహచరుడిగా గుర్తింపు పొందారు.తెలంగాణ ఉద్యమ కాలంలో కుటుంబానికి దూరంగా ఉండి, సభలు, సమావేశాలు, భారీ బహిరంగ కార్యక్రమాలు, ధూంధాం సాంస్కృతిక కార్యక్రమాలు, మీడియా సమావేశాలు వంటి ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కర్నె ప్రభాకర్ పాత్ర కీలకమైంది. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యక్రమాల సమన్వయంలో ఆయన చేసిన కృషి ప్రత్యేకంగా నిలిచింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం, 2014 ఆగస్టులో గవర్నర్ కోటా ద్వారా కర్నె ప్రభాకర్‌కు శాసన మండలి సభ్యునిగా అవకాశం కల్పించారు. ఎమ్మెల్సీగా పనిచేసిన కాలంలో ప్రభుత్వ విధానాలపై శాసన మండలిలో తన వాదనలను సమర్థంగా వినిపిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ప్రత్యేకించి మునుగోడు నియోజకవర్గ అభివృద్ధిపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. తాగునీరు, సాగునీరు, రహదారులు, విద్య, వైద్యం తదితర ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరు, అభివృద్ధి పనుల అమలుకు కృషి చేశారని స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు చెబుతుంటారు.పదవి ఉన్నప్పుడు మాత్రమే కాదు, పదవి లేకున్నా ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం కర్నె ప్రభాకర్ ప్రత్యేకతగా చెప్పబడుతుంది. రాజకీయాలకు అతీతంగా సహాయం అందించడం, ఎప్పుడైనా అందుబాటులో ఉండటం, ప్రజలతో నిరంతర అనుబంధాన్ని కొనసాగించడం వల్ల ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించింది. మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన కర్నె ప్రభాకర్ నిరాడంబర జీవన శైలితో పాటు స్పష్టమైన వాక్చాతుర్యంతో కూడా ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. సమకాలీన రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకుంటూ రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీల నాయకుడిగా ఎదిగారు.పార్టీ ఆవిర్భావం నుంచి ఉద్యమం వరకు, ఉద్యమం నుంచి పాలన వరకు, ప్రస్తుతం ప్రతిపక్షంలోనూ పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్న నాయకుడిగా ఆయనను బీఆర్ఎస్ కార్యకర్తలు భావిస్తుంటారు. మునుగోడు నియోజకవర్గంలో పార్టీని సమన్వయం చేస్తూ, కార్యకర్తలకు అండగా నిలుస్తూ ముందుకు సాగుతున్నారు.ఈ నేపథ్యంలో, పార్టీ కోసం ఇరవై ఐదు సంవత్సరాలకు పైగా చేసిన సేవలు, తెలంగాణ ఉద్యమంలో పోషించిన పాత్ర, మునుగోడు నియోజకవర్గంలో కొనసాగిస్తున్న ప్రజా సేవను పరిగణనలోకి తీసుకుని, రానున్న ఎన్నికల్లో మునుగోడు ఎమ్మెల్యే అభ్యర్థిగా కర్నె ప్రభాకర్‌కు అవకాశం కల్పించాలని స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కోరుతున్నారు. ఉద్యమానికి చేసిన త్యాగం, పార్టీ పట్ల చూపిన నిబద్ధత, ప్రజల్లో ఉన్న ఆదరణకు తగిన గుర్తింపుగా ఈ అవకాశం లభిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నాం.

రేపు కర్నె ప్రభాకర్ జన్మదినం సందర్భంగా...



ఇట్లుగుండమల్ల సతీష్ కుమార్,94931 55522

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com